# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 246 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | సోమవారం 27 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 246 27-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


జిల్లాల పునర్వ్యవస్థీకరణపై

## నేడు కీలక సమావేశం

**ముఖ్యమంత్రితో మంత్రివర్గ ఉపసంఘం భేటీ**



అమరావతి అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి ఈ నెల 28న కీలక సమావేశం జరగనుంది. ఇందుకు సంబంధించిన మంత్రివర్గ ఉపసంఘం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో భేటీ కానుంది. కొత్త జిల్లాల పునర్విభజన, జిల్లా కేంద్రాల

- తరువాయి 2లో..

తుపాను సహాయక చర్యల పర్యవేక్షణకు

## ప్రత్యేకాధికారులు

**టిఆర్-27 కింద రూ.19 కోట్లు నిధులు**

అమరావతి అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

'మొంథా' తుపాను నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ముందస్తు చర్యలు తీసుకునేందుకు వీలుగా జిల్లాలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. సమన్వయ బాధ్యతలను సీనియర్ ఐఎఎస్ అధికారులైన సిసోడియా, అజరుజైన్‌కు అప్పజెప్పింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది. సిసోడియా తూర్పుతీర ప్రాంతాల జోనల్ ఇన్‌ఛార్జిగా పశ్చిమ గోదావరి జిల్లా నుంచి చిత్తూరు వరకు సహాయక చర్యలను పర్యవేక్షించనున్నారు. అజరుజైన్ శ్రీకాకుళం నుంచి అంబేద్కర్ కోనసీమ జిల్లాల వరకు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించనున్నారు.

**జిల్లాల వారీ ప్రత్యేకాధికారుల నియామకం**

కెవిఎన్ చక్రధర్‌బాబు (శ్రీకాకుళం), పట్టణశెట్టి రవిసుభాష్ (విజయనగరం), నారాయణ భరత్‌గుప్తా (మన్యం), వాడరేవు వినరుచంద్ (ఎఎస్ఆర్), కె కన్నబాబు (తూర్పుగోదావరి), విఆర్ కృష్ణతేజ (కాకినాడ) విజయరామరాజు (అంబేద్కర్ కోనసీమ), వి ప్రసన్న వెంకటేష్ (పశ్చిమ గోదావరి), కాంతిలాల్ దండే (ఏలూరు), ఆమ్రపాళి (కృష్ణా), శశిభూషణ్‌కుమార్ (ఎన్‌టిఆర్), ఎం వేణుగోపాల్‌రెడ్డి (బాపట్ల), కోన శశిధర్ (ప్రకాశం), ఎన్ యువరాజ్ (నెల్లూరు), పి అరుణ్‌బాబు (తిరుపతి), పిఎస్ గిరీశా (చిత్తూరు) జిల్లాలకు ప్రత్యేకాధికారులుగా ప్రభుత్వం నియమించింది. వీరందరూ అన్ని శాఖల మధ్య సమన్వయం నెలకొల్పుతూ పని చేయాలని సూచించింది.

- తరువాయి 2లో..

# ఏపీ తీరం వైపు... 'మొంథా' తుపాను...

- రంగంలోకి భారత సైన్యం
- రానున్న 48 గంటల్లో 'మొంథా' తుపానుగా మారే సూచన
- అక్టోబర్ 28న మచిలీపట్నం-కాకినాడ మధ్య తీరం దాటే అవకాశం
- గంటకు 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం
- కోస్తాంధ్ర, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన
- అప్రమత్తమైన భారత సైన్యం.. సహాయక బృందాలు మోహరింపు

అమరావతి అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రానున్న 48 గంటల్లో తుపానుగా (మొంథా) బలపడనుందని, ఇది ఆంధ్రప్రదేశ్ తీరంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో భారత సైన్యం అప్రమత్తమైంది. తీరప్రాంత రాష్ట్రాల్లో సహాయక చర్యల కోసం తమ బృందాలను సిద్ధం చేసింది. అధికారిక సమాచారం ప్రకారం, ఆదివారం ఉదయం నాటికి బంగాళాఖాతంలోని తీవ్ర వాయుగుండం పోర్ట్ బ్లెయిర్‌కు పశ్చిమాన 610 కిలోమీటర్ల దూరంలో, చెన్నైకి తూర్పు-ఆగ్నేయంగా 790 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది మరింత బలపడి తుపానుగా, ఆ తర్వాత అక్టోబర్ 28 నాటికి

- తరువాయి 2లో..



## 'మొంథా' తుపాను ఎఫెక్ట్...

**ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్**

**మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ హెచ్చరికలు**

**28న కాకినాడ వద్ద తీరం దాటనున్న మొంథా తుపాను**

**తీరం దాటే సమయంలో గంటకు 110 కి.మీ వేగంతో గాలులు**

**మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారుల సూచన**



అమరావతి అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ రేపు (అక్టోబర్ 27) రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. పొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రాష్ట్రంలోని మరో 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, నంద్యాల, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, తూర్పు గోదావరి, అల్లూరి, అనకాపల్లి, విశాఖపట్నం, పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో

- తరువాయి 2లో..

ఆ మూడు రోజులు...

## అంతా అప్రమత్తం

- సాంకేతికత సాయంతో తుఫాను నష్ట నివారణకు చర్యలు చేపట్టాం
- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాం
- ఎటువంటి ప్రాణ, పశు, ఆస్తి నష్టం జరగకుండా అధికారులను అప్రమత్తం చేశాం
- రాష్ట్ర హెూమ్ మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత



అమరావతి అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అత్యాధునిక సమాచార సాంకేతికత సాయంతో 'మొంథా' తుపాను నష్ట నివారణకు అన్ని ముందస్తు చర్యలను

- తరువాయి 2లో..




# అనుక్షణం.. అప్రమత్తం

- తీరప్రాంత గ్రామాల్లో పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు
- ప్రాణ నష్టం జరగరాదు శ్రీ అంతరాయం లేకుండా విద్యుత్తు, టెలికాం, తాగునీరు
- మొంథా' తుఫాన్ ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధం కండి
- విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరాకు అంతరాయం రానివ్వొద్దు
- తీర ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి
- రోడ్లు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణ మరమ్మతులు
- అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం





అమరావతి అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మొంథా తుఫాన్ రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం అధికారులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ తీసుకున్నారు. వాయుగుండం 28వ తేదీ ఉదయం నాటికి తీవ్రమైన తుఫానుగా మారుతుందని, ఈ సమయంలో ఎక్కడా ఎటువంటి ప్రాణ-ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం నుంచి కాకినాడ ప్రాంతం వరకు తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిస్తుందని, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని సీఎం చెప్పారు. ఎస్ఎంఎస్ అలర్ట్స్, సోషల్ మీడియా, ఐవీఆర్ఎస్ కాల్స్, వాట్సాప్‌ల ద్వారా ప్రజలకు ముందస్తుగా హెచ్చరికలు పంపించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి

- తరువాయి 2లో..

కర్నూలు బస్సు దగ్ధం ఘటన...

## 18 మృతదేహాలు కుటుంబ సభ్యులకు అప్పగింత

కర్నూలు, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కర్నూలు సమీపంలో జరిగిన ఘోర బస్సు అగ్నిప్రమాదంలో మృతి చెందిన 19 మందిలో 18 మంది మృతదేహాలను డీఎన్ఏ పరీక్షల అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గత రెండు రోజులుగా కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (%++ఎ%)లో నిర్వహించిన డీఎన్ఏ పరీక్షల ప్రక్రియ ఆదివారం పూర్తి కావడంతో అధికారులు మృతదేహాలను కుటుంబాలకు

- తరువాయి 2లో..



# సమాజానికి ప్రమాదకరంగా 'బ్లూ బ్యాచ్'

- 'బ్లూ బ్యాచ్' సమాజానికి ప్రమాదకరంగా మారిందనడంలో సందేహం లేదు: మంత్రి నారా లోకేశ్
- వైసీపీ అనుబంధ సోషల్ మీడియాపై మంత్రి లోకేశ్ తీవ్ర విమర్శలు
- పక్క రాష్ట్రం వీడియోను అరకులో జరిగిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- గతంలోనే ఫ్యాక్ట్ చెక్ ద్వారా నిజాలు వెల్లడించామన్న మంత్రి
- అది రాజకీయ పార్టీనా లేక నేరగాళ్ల ముఠానా అని ఘాటు వ్యాఖ్య
- ఫేక్ ప్రచారాలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశం
- ఇలాంటి వార్తలను ప్రజలు నమ్మవద్దని నారా లోకేశ్ సూచన



అమరావతి అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఓ అంశంలో సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పొరుగు రాష్ట్రంలోని ఒక గురుకుల పాఠశాలలో 2023లో జరిగిన ఘటనకు సంబంధించిన వీడియోను, తాజాగా అరకులో జరిగినట్లు చిత్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి ఫేక్ ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలనుకునే శక్తులు సమాజానికి అత్యంత ప్రమాదకరమని ఆయన 'ఎక్స్' ద్వారా హెచ్చరించారు. "తప్పుడు ప్రచారం ఆధారంగా రాజకీయం చేద్దామనుకుంటున్న 'బ్లూ బ్యాచ్' సమాజానికి ప్రమాదకరంగా మారిందనడంలో సందేహం లేదు. పక్క రాష్ట్రంలో ఒక గురుకుల పాఠశాలలో 2023 నాటి పరిస్థితికి సంబంధించిన ఒక వీడియోను తాజాగా అరకు లో జరిగినట్లు ఒక కథనం రాసి వైసీపీ అనుబంధ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇదే వార్తపై, ఇదే వీడియో పై రాష్ట్ర ప్రభుత్వం తరపున 'ఫ్యాక్ట్ చెక్' లో సంపూర్ణ వివరాలతో

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

# ‘తుది’ యాత్ర!

‘నిర్లక్ష్యం ప్రాణాల కంటే చవకగా మారినప్పుడు, నాగరికత తన అర్థాన్ని కోల్పోతుంది’ అంటారు గాంధీజీ. మన పాలకులు, అధికార యంత్రాంగం, సాంకేతికత ప్రజల మాన ప్రాణాలకు భరోసాగా నిలవలేనప్పుడు, ఒక నిర్లక్ష్యపు చర్య వలన నిరపరాధులు ప్రాణాలు కోల్పోతే, ఆ అభివృద్ధి తన విలువను కోల్పోతుంది. ట్రావెల్స్ యాజమాన్యం నిర్లక్ష్యం, ఫిట్‌నెస్ లేని వాహనం, అధిక వేగం, డ్రైవర్ అలసట, భద్రతా లోపాలు– వీటి విలువ 19 నిండు ప్రాణాలు. ఇది గుండెల్ని పిండే విషాదం. గాల్లో తేలుతున్నట్లు రోడ్డుపై దూసుకుపోయే ప్రైవేటు బస్సు సృష్టించిన భయానక వీరంగం. ప్రైవేటు బస్సు యాజమాన్యాలు ప్రయాణీకుల భద్రత కంటే లాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారన్న కఠోర వాస్తవాన్ని మరోసారి కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం తెరపైకి తెచ్చింది.

ఒక కొడుకు ఫోన్ చేసి%ొ% ‘నేను సూర్యాపేట జంక్షన్‌లో వెయిట్ చేస్తున్నా అంటే, ఆ..ఆ.. నేను కాసేపట్లో వచ్చేస్తాను’ అంటాడో తండ్రి బస్సులో నుంచి. ఒక తండ్రి కుమార్తెతో ‘ఉదయం నువ్వు నిద్ర లేచేసరికి నీ ముందుంటాను. హాయిగా నిద్రపో తల్లీ%ొ%’ అంటాడు. ఇలాంటి సంభాషణలు ‘జర్నీ’ సినిమాలో చూశాం. కర్నూలు జిల్లాలో అగ్నికి ఆహుతైన బస్సులోనూ ఇలాంటి దృశ్యమే జరిగింది. కాకపోతే.. ఇక్కడ ఒక కూతురు తన తండ్రికి చెబుతుంది ఇలాంటి మాటలే. సెలవులు గడిపి వెళుతున్నవారు, ఉద్యోగాల కోసం, వ్యాపారాల కోసం వెళుతున్నవారు– వీరందరి గమ్యస్థానం బెంగళూరు. రేపటి గురించి కలలు కంటూ స్లీపర్ బస్సులో ఆదమరిచి నిద్రిస్తున్నారంతా. వారికి తెలియదు అదే తమ చివరి ప్రయాణమని. నిబంధనలు, భద్రతా ప్రమాణాలు ఏమాత్రం పాటించని ప్రైవేటు నిర్వాకం.. ఆ ప్రయాణాన్ని ‘డెత్ జర్నీ’గా మార్చేసింది. వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు క్షణాల్లో అగ్నిగుండంగా మారింది. గుర్తుపట్టలేని విధంగా బొగ్గుల్లా మారాయి ప్రయాణీకులు మృతదేహాలు. మొత్తం 44 మంది ప్రయాణీకుల్లో 19మంది సజీవ దహనమయ్యారు. బస్ లగేజీ క్యాబిన్‌లోని సుమారు 400 మొబైల్ ఫోన్లు పేలడం వల్ల కూడా ప్రమాద తీవ్రత పెరిగిందని ఫోరెన్సిక్ బృందాల ప్రాథమిక అంచనా. ఇటీవల రాజస్తాన్‌లో ఇలాంటి దుర్ఘటనే జరిగింది. 21మంది కాలి బూడిదయ్యారు.

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో స్లీపర్ బస్సులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రైవేట్ ఆపరేటర్లకు రాబడి యావ తప్ప ప్రయాణీకుల భద్రత పట్టదు. సరైన అనుమతుల్లేకుండా, పాత బస్సులకు మెరుగులు దిద్ది రోడ్డెక్కిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో నేషనల్ పర్మిట్ తీసుకొని స్లీపర్లుగా మార్చుతున్నారు. ఈ బస్సుల డిజైన్లలోని లోపాలే మృతుల సంఖ్య పెరగడానికి కారణమని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. స్లీపర్ బస్సుల్లో సీట్ల మధ్య గాని, నడవడానికి గాని ఖాళీయే వుండదు. చాలా వాటికి ఎమర్జెన్సీ డోర్స్ కూడా వుండవు. గంటకు 130–140 కి.మీ. వాయువేగంతో పరుగులెత్తే ట్రావెల్ బస్సులు%ొ%ప్రయాణీకుల భద్రతను గాలికొదిలేస్తున్నాయి. బెంగళూరు–హైదరాబాద్ మధ్యనున్న 575 కి.మీ. దూరాన్ని ఏడుగంటల్లో చేరుకోవాలి. అంటే, గంటకు కనీసం 120–140 కి.మీ. వేగంతో ప్రయాణం చేయాలి. వేగం తగ్గినా, గమ్యాన్ని చేరుకునే సమయం దాటినా ఆ డ్రైవర్ యజమానికి వివరణ ఇచ్చుకోవాలి. ఈ క్రమంలో ట్రావెల్ బస్సులకు స్పీడ్ లాకింగ్ వున్నా%ొ% వాటిని తొలగించేస్తున్నారు. మోటారు వాహన చట్టం ప్రకారం.. వాణిజ్య వాహనాల క్యాటగిరీ కింద వచ్చే వాహనాల వేగం గరిష్టంగా గంటకు 90 కి.మీ. మించి వుండరాదు. ఈ మేరకు స్పీడ్ లాకింగ్ వుండాలి. ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సుల్లో అయితే, గరిష్టంగా 80 కి.మీ, ఏసీ బస్సుల్లో 90 కి.మీ. వేగం వరకు మాత్రమే ప్రయాణించేలా స్పీడ్ లాకింగ్ వుంటుంది. ఈ విధానాన్ని ప్రైవేట్ బస్సు యాజమాన్యాలు అతిక్రమిస్తూ, ప్రయాణీకుల ప్రాణాలను గాల్లో కలిపేస్తుంటే%ొ% రవాణాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

ప్రతి ప్రమాదం ఒక పాఠం కావాలి. కానీ మనం పాఠం నేర్చుకోవడంలోనే విఫలమవుతున్నాం. కనుకనే ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం అవుతున్నాయి. ‘పబ్లిక్ సేఫ్టీ’ ఒక నినాదం కాదు, అదొక బాధ్యత. ప్రభుత్వాలు ప్రమాదాల నివారణకు శాశ్వత మార్గాలను అన్వేషించాలి. కఠిన నిబంధనలను అమలుచేయాలి. అతిక్రమించినవారి పర్మిట్లను రద్దు చేయాలి. అన్నిటికంటే ముందు అతివేగాన్ని కట్టడి చేయాలి.

## జిల్లాల పునర్వ్యవస్థీకరణపై నేడు కీలక సమావేశం

మార్పులపై ఈ సమావేశంలో చర్చించే అవకాశమున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కొత్త జిల్లాలు, జిల్లా కేంద్రాల మార్పులకు సంబంధించిన పలు సూచనలను కేబినెట్ సబ్ కమిటీ ఇప్పటికే సూచించింది. కేబినెట్ సబ్ కమిటీలో వెల్లడయ్యే అంశాలపై నవంబరు 7న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియను డిసెంబరు 31 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

## తుపాను సహాయక చర్యల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు

విపత్తుల నిర్వహణ శాఖ టిఆర్–27 కింద రూ.19 కోట్లు తుపాను ప్రభావిత ప్రాంతాలకు నిధులను మంజూరు చేసింది. తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు రూ.కోటి చొప్పున, చిత్తూరు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, గుంటూరు, పల్నాడు, ఎన్‌టిఆర్, ఏలూరు, తూర్పుగోదావరి, ఎఎస్ఆర్, పార్వతీపురం మన్యం జిల్లాలకు రూ.50 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు.

## ఏపీ తీరం వైపు... మొంథా తుపాను

తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది. ఈ తుపాను అక్టోబర్ 28 సాయంత్రం లేదా రాత్రి సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం, కాకినాడ మధ్య తీరాన్ని తాకే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, కొన్నిసార్లు గాలి వేగం 110 కిలోమీటర్లకు చేరుకోవచ్చని హెచ్చరించారు. దీని ప్రభావంతో కోస్తా ఒడిశా, ఉత్తర తమిళనాడు ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు, బలమైన గాలులు నమోదవుతాయని తెలిపారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో భారత సైన్యం జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (%చీణహీూ%), భారత వాతావరణ శాఖ (%×వీణ%), తీరప్రాంత రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతరం సమన్వయం చేసుకుంటోంది. ఇప్పటికే ప్రభావితమయ్యే అవకాశం ఉన్న రాష్ట్రాలకు విపత్తు సహాయక బృందాలను (%ణ=జం%) తరలించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు 10 యాక్టివ్, 7 రిజర్వ్ బృందాలను కేటాయించింది. కర్ణాటక, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, లక్షద్వీప్ దీవులకు కూడా ఆర్మీ బృందాలు చేరుకున్నాయి. ఆర్మీ కంట్రోల్ రూమ్‌ల ద్వారా 24 గంటలూ పరిస్థితిని సమీక్షిస్తున్నామని, ‘మొంథా’ తుపాను వల్ల ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా ప్రజలకు అవసరమైన మానవతా సహాయం, సహాయక చర్యలు అందించడానికి పూర్తి సన్నద్ధతతో ఉన్నామని ఆర్మీ అధికారి ఒకరు ఆదివారం స్పష్టం చేశారు.

## ‘మొంథా’ తుపాను ఎఫెక్ట్...

అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఈ జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం మరింత బలపడి పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతోంది. ఇది రాబోయే 24 గంటల్లో ‘మొంథా’ తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (%×వీణ%) వెల్లడించింది. ప్రస్తుతం ఈ వాయుగుండం కాకినాడకు ఆగ్నేయంగా 830 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుపాను అక్టోబర్ 28వ తేదీ సాయంత్రం లేదా రాత్రి సమయంలో మచిలీపట్నం, కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గాలి వేగం 110 కిలోమీటర్లకు చేరుకోవచ్చని అధికారులు హెచ్చరించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

## ఆ మూడు రోజులు...

### అంతా అప్రమత్తం

చేపట్టడం జరిగిందని రాష్ట్ర హోమ్ మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఆదివారం తాడేపల్లి లోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరము ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ మొంథా తుపాను నేపథ్యంలో ప్రభుత్వం హై అలెర్ట్ గా ఉందన్నారు. గతంలో సంభవించిన తుఫాన్ల సందర్భంగా ఎదుర్కొన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పతిష్టమైన ముందస్తు చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఎటువంటి ప్రాణ, పశు, ఆస్తి నష్టం జరగకుండా అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయ్ నుంచి రాష్ట్ర అధికారులతో పలుమార్లు కాన్ఫరెన్స్ లు నిర్వహించి అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ఇదే అంశంపై గత నాలుగు రోజుల నుండి రాష్ట్ర ప్రజలను పలు మాధ్యమాల ద్వారా అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా తక్షణ చర్యలు చేపట్టేందుకు అన్ని జిల్లాలకు నోడల్ అధికారులుగా ఐఏఎస్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. 6 ఎన్ డి ఆర్ ఎఫ్, 13 ఎస్డీ ఆర్ఎఫ్ టీమ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. హెలికాప్టర్ లతో నావెల్ అధికారులను సిద్ధం చేయడం జరిగిందని, అన్నిచోట్ల హెలీపాడ్లను కూడా సిద్ధం చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అవసరం అయితే బెంగళూరు, చెన్నై మరియు హైదరాబాద్ నుంచి కూడా హెలికాప్టర్ లను తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. తీరా ప్రాంతాల్లో 14 బోట్లను కూడా సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ తుఫాను సందర్భంగా గంటకు 100 కిలోమీటర్ల పైబడి భారీ గాలులు వీచే అవకాశం ఉన్నందున, ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని రకాల హోర్డింగ్లను తొలగించాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు. తుఫాను కు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే వదంతులను ఎవరూ నమ్మవద్దని, అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ల టోల్ నెంబర్ కు ఫోన్ చేసి స్పష్టమైన సమాచారం తెలుసుకోవచ్చని, తక్షణ సహాయం కూడా పొందవచ్చు అని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, తక్షణ సహాయం అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అధికారుల సూచనలను పాటిస్తూ సహకరించాలని, ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆమె విజ్ఞప్తి చేశారు.

స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## అనుక్షణం.. అప్రమత్తం

రాష్ట్ర స్థాయి వరకు తుఫాన్ ప్రభావంపై సమాచారం వేగంగా చేరవేసి, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే తీర జిల్లాలలో మోహరించామని వెల్లడించిన ముఖ్యమంత్రి... తుఫాన్‌పై ప్రెడిక్టివ్ మోడల్, రియల్ టైమ్ డేటా ఆధారంగా విశ్లేషణ చేస్తున్నామన్నారు. రిజర్వాయర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించి అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలని స్పష్టం చేశారు.

**పవర్ సా, జేసీబీలు, క్రేన్లు సిద్ధం చేయండి**

రాష్ట్రవ్యాప్తంగా 27,000 సెల్ టవర్లను డీజిల్ జనరేటర్లతో సిద్ధం చేశామని ముఖ్యమంత్రి అన్నారు. విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను తక్షణమే సమీపంలోని తుఫాన్ రక్షణ కేంద్రాలకు తరలించి పునరావాసం కల్పించాలని సూచించారు. తుఫాన్ తీవ్రతను బట్టి విద్యా సంస్థలకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవులు ప్రకటించాలన్నారు. రహదారులు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు. చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించడానికి అవసరమైన పవర్ సా, క్రేన్‌లు, జేసీబీలు ప్రతీ సబ్ డివిజన్ స్థాయిలో సిద్ధం చేయాలని, డ్రోన్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టేలా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. అయితే తుఫాన్ రక్షణ చర్యలపై ఇప్పటివరకు 11 సార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వాహనాలు సిద్ధం చేశామని, రాష్ట్రవ్యాప్తంగా 851 జేసీబీలు, అలాగే క్రేన్‌లు – పవర్ సాలు 757 అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

**సోషల్ మీడియాను వాడుకోవాలి..**

మచిలీపట్నం నుంచి కాకినాడ వరకు తుపాన్ తీవ్ర ప్రభావం చూపిస్తుందని, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని సీఎం చెప్పారు. ఎస్ఎంఎస్ అలర్ట్స్, సోషల్ మీడియా, ఐవీఆర్ఎస్ కాల్స్, వాట్సాప్‌ల ద్వారా ప్రజలకు ముందస్తుగా హెచ్చరికలు పంపించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తుపాన్ ప్రభావంపై ఎప్పటికప్పుడు సమాచారం వేగంగా చేరవేయాలని, నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.

**రంగంలోకి ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు**

తీర జిల్లాలలో ఇప్పటికే ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు మోహరించామని వెల్లడించిన ముఖ్యమంత్రి.. తుపాన్‌పై ప్రెడిక్టివ్ మోడల్, రియల్ టైమ్ డేటా ఆధారంగా విశ్లేషణ చేస్తున్నామన్నారు. రిజర్వాయర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించి అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు సూచించారు.

**విద్యుత్, తాగునీటి సరఫరాకు అంతరాయం కలగవద్దు**

రాష్ట్రవ్యాప్తంగా 27,000 సెల్ టవర్లను డీజిల్ జనరేటర్లతో సిద్ధం చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు నిర్దేశించారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను తక్షణమే సమీపంలోని తుఫాన్ రక్షణ కేంద్రాలకు తరలించి పునరావాసం కల్పించాలని సూచించారు. తుఫాన్ తీవ్రతను బట్టి విద్యా సంస్థలకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవులు ప్రకటించాలన్నారు. రహదారులు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు. చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించడానికి అవసరమైన పవర్ సా, క్రేన్‌లు, జేసీబీలు ప్రతీ సబ్ డివిజన్ స్థాయిలో సిద్ధం చేయాలని, డ్రోన్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టేలా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు.

**ఎమర్జెన్సీ వాహనాలు సిద్ధం**

తుపాన్ రక్షణ చర్యలపై ఇప్పటివరకు 11 సార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వాహనాలు సిద్ధం చేశామని, రాష్ట్రవ్యాప్తంగా 851 జేసీబీలు, అలాగే క్రేన్‌లు – పవర్ సాలు 757 అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

**సముద్రంలోని పడవలను వెనక్కి పిలిపించాలి**

పంటనష్టం వివరాలను స్పష్టంగా తెలుసుకునేలా వ్యవసాయ శాఖ–ఆర్టీజీ వ్యవస్థ సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇంకా సముద్రంలోనే ఉన్న 82 మెకనైజ్డ్ పడవలు, 37 మోటరైజ్డ్ పడవలను సురక్షితంగా తీరానికి రప్పించే చర్యలు తీసుకోవాలన్నారు. ఈసారి మొంథా తుపాన్ ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ జిల్లాలకు ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించామని.. ప్రతీ శాఖ, ప్రతీ విభాగం సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రజల ఆస్తి, ప్రాణ, మౌలిక సదుపాయాల రక్షణకు ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

**సముద్రంలో పడవలు వెనక్కి రప్పించండి**

మరోవైపు పంటనష్టం వివరాలను స్పష్టంగా తెలుసుకునేలా వ్యవసాయ శాఖ–ఆర్టీజీ వ్యవస్థ సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇంకా సముద్రంలోనే ఉన్న 82 మెకనైజ్డ్ పడవలు, 37 మోటరైజ్డ్ పడవలను సురక్షితంగా తీరానికి రప్పించే చర్యలు తీసుకోవాలన్నారు. ఈసారి మొంథా తుపాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ జిల్లాలకు ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించామని... ప్రతీ శాఖ, ప్రతీ విభాగం సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రజల ఆస్తి, ప్రాణ, మౌలిక సదుపాయాల రక్షణకు ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## 18 మృతదేహాలు

## కుటుంబ సభ్యులకు అప్పగింత

అందజేశారు. కర్నూలు జిల్లా కలెక్టర్ ఎ. సిరి ఈ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు మరణ ధృవీకరణ పత్రాలు కూడా జారీ చేశారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించేందుకు అధికారులు ప్రత్యేక అంబులెన్సులను ఏర్పాటు చేశారు. మృతులలో ఆరుగురు ఆంధ్రప్రదేశ్, ఆరుగురు తెలంగాణకు చెందిన వారు కాగా.. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన చెరో ఇద్దరు, ఒడిశా, బీహార్‌కు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. మరో మృతదేహాన్ని గుర్తించాల్సి ఉండటంతో దానిని జీజీహెచ్‌లోనే భద్రపరిచారు. ఇంతలో, చిత్తూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తన తండ్రి ఈ ప్రమాదంలో మరణించి ఉండవచ్చని పోలీసులను ఆశ్రయించడంతో, డీఎన్ఏ పరీక్ష ద్వారా గుర్తింపు ప్రక్రియ పూర్తి చేస్తామని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

**ప్రమాదం జరిగిందిలా...**

హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ఈ ప్రైవేట్ బస్సులో ఇద్దరు డ్రైవర్లతో సహా మొత్తం 46 మంది ప్రయాణిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3 నుంచి 3:15 గంటల మధ్య కర్నూలు శివార్లలోని చిన్నటేకూరు వద్ద ఈ దుర్ఘటన జరిగింది. రోడ్డు డివైడర్‌ను ఢీకొని కిందపడి ఉన్న ఓ మోటార్ సైకిల్‌ను బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. సుమారు 200 మీటర్ల దూరం బైక్‌ను ఈడ్చుకెళ్లడం వల్ల నిప్పురవ్వలు చెలరేగి, బైక్ నుంచి లీకైన ఇంధనం కారణంగా బస్సుకు భారీగా మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులతో సహా 19 మంది సజీవ దహనం కాగా, ఇద్దరు డ్రైవర్లు సహా 27 మంది అద్దాలు పగలగొట్టుకుని ప్రాణాలతో బయటపడ్డారు.

**దర్యాప్తులో కీలక విషయాలు**

పోలీసుల దర్యాప్తులో ఈ ఘటనకు కారణమైన పరిస్థితులు వెలుగులోకి వచ్చాయి. బి. శివశంకర్ (22) అనే యువకుడు మద్యం మత్తులో బైక్ నడుపుతూ డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని వెనుక కూర్చున్న ఎర్రిస్వామి అలియాస్ నాని స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం తర్వాత, రోడ్డు మధ్యలో పడి ఉన్న బైక్‌ను పక్కకు తీసేలోపే వేగంగా వచ్చిన బస్సు దానిని ఢీకొట్టింది. బస్సుకు మంటలు అంటుకోవడం చూసి భయంతో నాని అక్కడి నుంచి పారిపోయాడు. ప్రమాదానికి ముందు పెట్రోల్ పంపు వద్ద రికార్డయిన సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు ఎర్రిస్వామిని గుర్తించి, అతని స్వగ్రామం తుగ్గలిలో అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఓ ప్రయాణికుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య, వి కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్‌లపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సమాజానికి ప్రమాదకరంగా ‘బ్లూ బ్యాచ్’

సమాచారం అందించినా కూడా కొద్ది రోజులు ఊరుకుని మళ్లీ అదే వీడియోతో తాజాగా తప్పుడు ప్రచారం ప్రారంభించారు. ఇలా తరచూ నేరాలకు పాల్పడేవారిని ‘హ్యాబిచ్యువల్ అఫెండర్స్’ (నేరాలు చేయడానికి అలవాటు పడ్డవారు) అంటారు. అందుకే అది ఒక రాజకీయ పార్టీనా, లేక హ్యాబిచ్యువల్ అఫెండర్స్ ముఠానా అనే అనుమానం వస్తున్నది. ఈ ఫేక్ ప్రచారాన్ని ప్రజలు ఎవరూ కూడా నమ్మవద్దు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేసేవారిపై చర్యలు తీసుకోవలసిందిగా పోలీసులను వారిని కోరుతున్నాను” అని లోకేశ్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

## దేశంలో 22 ఫేక్ యూనివర్సిటీలు: యూజీసీ హెచ్చరిక

**దిల్లీ :** దిల్లీ కోట్లా ముబారక్‌పుర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజినీరింగ్ సంస్థ విషయంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తాజాగా మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. అనుమతులు లేని డిగ్రీ కోర్సులను నిర్వహిస్తోందని పేర్కొంది. ఆ సంస్థ జారీ చేసే డిగ్రీలకు ఎలాంటి విలువ లేదని తెలిపింది. అసలు ఈ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలకు సంబంధించి ఏ చట్టం కింద ప్రారంభించలేదని యూజీసీ స్పష్టం చేసింది. యూజీసీ డేటా ప్రకారం దేశంలో 22 గుర్తింపులేని యూనివర్సిటీలను నిర్వహిస్తున్నారని తేలింది. వీటిల్లో 9 దేశ రాజధాని దిల్లీలో ఉన్నాయి. ఐదు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉండగా.. మిగిలినవి కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరిల్లో నిర్వహిస్తున్నట్లు యూజీసీ గణాంకాలు చెబుతున్నాయి.



# నేడు పిజిఆర్ఎస్ రద్దు..

### .. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



అక్టోబర్ 27వ తేదీన సోమవారం కలెక్టరేట్లో జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (PGRS) కార్యక్రమాన్ని మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మండల్, డివిజన్, జిల్లా స్థాయిలో రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు విషయం గమనించుకొని ఎవరూ కూడా అర్జీలు తీసుకొని మండల్, డివిజన్, కలెక్టరేట్ కార్యాలయాలకు రావద్దని, సహకరించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## 27,28 తేదీల్లో

## అంగన్‌వాడీ, విద్యాసంస్థలకు సెలవు

**భీమవరం అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్వాడీలకు అక్టోబర్ 27, 28 తేదీలను సెలవు దినాలుగా ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మొంథా తుఫాన్ కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించే ఉద్దేశంతో జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీలు, కళాశాలలు ఇతర విద్యాసంస్థలు అన్నింటికి రెండు రోజులపాటు సెలవు దినాలుగా ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆదేశాలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

# 28న జిల్లాలో తీవ్రమైన గాలులు, భారీ వర్షాలు ఉండే అవకాశం

- జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీలకు ఈనెల 27, 28 తేదీలలో సెలవు
- వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లాకు రానున్న ఎస్డిఆర్ఎఫ్ బలగాలు
- గంటకు 120 కి. మి. వేగంతో గాలులు వీచవచ్చు.. హోర్డింగ్ లు, విద్యుత్ స్థంబాల వాడిఫా భద్రతా చర్యలు తీసుకోవాలి
- గోదావరి నదిలోనికి పర్యాటక లాంచీలను నిలిపివేయాలి
- జిల్లా, అన్ని మండలాలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు
- ప్రజలకు అందుబాటులో గ్రామానికి ఒక నోడల్ అధికారి
- తుఫాన్ తీవ్రతపై జిల్లా ఎస్పీతో కలిసి అధికారులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అప్రమత్తం చేసిన జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి

**ఏలూరు, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఏలూరు జిల్లాలో 'మొంథా తుఫాన్' ప్రభావంతో ఈనెల 27 నుండి 29వ తేదీ వరకు తీవ్రగాలులు, భారీ వర్షాల కారణంగా హోర్డింగ్ లు కూలే ప్రమాదం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వాటి కారణంగా ప్రాణ నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. తుఫాన్ తీవ్రతపై జిల్లా యంత్రాంగం తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా ఎస్పీతో కలిసి ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అప్రమత్తం చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ తోఫాన్ సమయంలో 120 కిలోమీటర్ల వేగంతో తీవ్రగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని, దీని కారణంగా హోర్డింగ్ లు, ఆస్బెస్టాస్ రేకులు, ఐరన్ రేకులు ఎగిరిపోయి అవకాశం ఉందని, ప్రజలు .. ప్రజలు అప్రమత్తం ఉండాలన్నారు. తుఫాన్ పరిస్తితి దృష్ట్యా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు, కళాశాలలు, అంగన్వాడీలకు ఈనెల 27, 28 తేదీలలలో సెలవు ప్రకటించడమైందని, ప్రైవేట్ విద్యా సంస్థలలో స్టడీ అవర్స్ వంటివి నిర్వహించకుండా విద్యా శాఖ అధికారులు పరిశీలించాలన్నారు. గోదావరి నదిలోని పర్యాటక లాంచీలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని మండల, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ నెంబర్ 9491041419, టోల్ ఫ్రీ నెంబర్ 18002331077 లకు ఫోన్ చేసి ప్రజలు తూఫాన్ పరిస్థితి తెలుసుకోవచ్చని, అవసరమైన సహాయం పొందవచ్చన్నారు. తూఫాన్ సమయంలో చెట్లు కూలి రవాణా సౌకర్యాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా వెంటనే చెట్లు తొలగించేలా అధికారులు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తూఫాన్ సమయంలో ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు ప్రతీ గ్రామానికి ఒక నోడల్ అధికారిని నియమించాలని, శిధిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లల్లోని వ్యక్తులను, లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆదివారం రాత్రి నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. నదులు వాగులోకి ప్రజలు వెళ్లకుండా చూడాలని, కల్వర్టులు, కాజ్ వే లు, వాగులను ప్రజలు దాటకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడంతోపాటు, ఆ ప్రదేశాలలో సిబ్బందిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. తూఫాన్ తీరం దాటే సమయంలో తీవ్రమైన గాలులు వీస్తాయని, ప్రజలు ఇంటినుండి బయటకు రావద్దన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రైన్లలో వరద నీరు చేరి నివాసిత ప్రాంతాలు ముంపునకు గురికాకుండా డ్రైన్లలో మురుగును వెంటనే తొలగించాలన్నారు. తీవ్రమైన గాలులు సమయంలో విద్యుత్ స్థంబాలు కూలే అవకాశం ఉన్నందున, విద్యుత్ సంస్థ అధికారులు తక్షణమే చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని, జిల్లా, డివిజన్ స్థాయిలో విద్యుత్ సంస్థ కంట్రోల్ రూంలు ఏర్పాటుచేయాలన్నారు. తూఫాన్ సహాయక కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటర్ లను ఏర్పాటు చేయాలన్నారు. సెల్ ఫోన్ టవర్ల వద్ద సెల్ఫోన్ నెట్వర్క్ కు అంతరాయం లేకుండా జనరేటర్ లు ఏర్పాటుచేయాలని, వాటికి అవసరమైన డీజిల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తూఫాన్ పునరావాస కార్యక్రమాలకు రాష్ట్రం నుండి ఎస్డిఆర్ఎఫ్ బలగాలు జిల్లాకు విచ్చేస్తున్నాయని కలెక్టర్ వెట్రిసెల్వి తెలియజేసారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ మండల స్థాయిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటుచేయడం జరిగిందని, ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు పోలీసు సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు.

జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, రమణ, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### తుఫాన్ నేపథ్యంలో అధికారులు,

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**కొత్తపేట, అక్టోబర్ 26 ( తెలుగు రాష్ట్రం):**



ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారి, నేడు లేదా రేపు తుఫానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ తుఫాన్ మంగళవారం రాత్రి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో కొత్తపేట నియోజకవర్గంలోని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. తుఫాన్ తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకంగా విద్యుత్ వినియోగదారులు, రైతులు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అలాగే విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సమయానుసారం అందించి, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాన్ పరిస్థితులపై సమయానుసారం సమాచార మార్పిడి జరగడానికి కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ కంట్రోల్ రూమ్ నంబర్లకు సంప్రదించవచ్చు: 08855-244299, 8500238258. అలాగే విద్యుత్ శాఖ హెల్ప్‌లైన్‌లు అమలాపురం, రామచంద్రపురం కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ అధికారులు ఇచ్చిన సూచనలను ప్రజలు తప్పనిసరిగా పాటించి, తుఫాన్ సమయంలో భద్రతతో ఉండాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు.

# మొంథా తుఫాన్ అలర్ట్.

### అప్రమత్తంగా ఉండండి%ప్రాణ భద్రతే ప్రాధాన్యం.

### చింతపల్లి ఎంపీపీ అనూష దేవి.



**చింతపల్లి, అక్టోబర్ 26 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

బంగాళాఖాతంలో ఏర్పడి తీరం వైపు దూసుకొస్తున్న మొంథా తుఫాన్ ప్రభావంతో రాబోయే మూడు రోజులు భయంకర వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనుషా దేవి మండల ప్రజలకు సూచనలు చేశారు. సోమ, మంగళ, బుధవారాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. మండలంలోని కొండ ప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో వాగులు, వంకలు ఎప్పుడైనా పొంగిప్రవహించే అవకాశం ఉన్నందున యథేచ్ఛగా రాకపోకలు చేయవద్దని, అవసరం ఉంటే తప్ప ఇళ్ల బయటకు రావద్దని ప్రజలను అప్రమత్తం చేశారు. కొండచరియలు విరిగిపడి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే అక్కడి నుంచి దూరంగా జరగాలని సూచించారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే కలెక్టర్ కార్యాలయంలో ఉన్న కంట్రోల్ రూమ్ నంబర్లకు సంప్రదించాలని ఎంపీపీ వివరించారు. ప్రజల భద్రత కోసం స్థానిక అధికారులు, పోలీసు విభాగం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చారు. అవసరమైతే అధికారులు తక్షణమే రక్షణ చర్యలు చేపట్టేలా తమ సహకారం కొనసాగుతుందని ఎంపీపీ అనూష పేర్కొన్నారు. ప్రజలు పుకార్లను నమ్మకూడదని, అధికారిక సంస్థల హెచ్చరికలను మాత్రమే పాటించాలని విజ్ఞప్తి చేశారు.

### "మొంథా తుపాను" ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు

# జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలి

**జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు 08816 - 299219**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆదివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి " మొంథా తుఫాన్" ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకునే సన్నద్ధత ఏర్పాట్లపై రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మొంథా తుపాను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు. రేపటి నుండి మూడు రోజులు పాటు జిల్లాలో భారీగా వర్షాలు కురియనున్న దృష్ట్యా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను తీవ్రత దృష్ట్యా జిల్లాలో ఎక్కడ ప్రాణ, ఆస్తి జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా నరసాపురం డివిజన్లో 10, తాడేపల్లిగూడెం డివిజన్లో 8, భీమవరం డివిజన్లో 10 పునరావాస కేంద్రాలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. తుఫాను తీవ్రత, భారీ వర్షాల దృష్ట్యా మరిన్ని పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద త్రాగునీరు, భోజన సౌకర్యం తోపాటు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలలో రాబోయే వారం రోజులకు సరిపడా నిత్యవసర వస్తువులను ఆయా ప్రాంతాలలో సిద్ధం చేసి ఉంచాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలని, ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులను తిరిగి ఒడ్డుకు తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జిల్లాలో ఉప విద్యుత్ కేంద్రాల వద్ద ముందస్తుగా జనరేటర్లు, డీజిల్ సిద్ధంగా ఉంచుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల నుండి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు ముందస్తుగా బలహీనంగా ఉన్న కాలువ గట్లు, నదీ పరివాహక ప్రాంతం గట్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. బలమైన ఈదురు గాలులు మూలంగా రోడ్లపై చెట్లు పడిపోతే సత్వరమే వాటిని తొలగించి రవాణాకు ఇబ్బందు లేకుండా చూసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.



తుఫాను ప్రభావిత గ్రామాలలో ప్రజలకు నిత్యవసర సరుకులైన రైస్, షుగర్, పాలు, ఉల్లిపాయలు, కూరగాయలు, వంట నూనెలు కొరత లేకుండా అందుబాటులో ఉండే విధంగా చూడాలని పౌరుసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక శాఖ బోట్లు, లైఫ్ జాకెట్లు, నిల్వ ఉన్న నీటిని తోడేందుకు మోటార్ ఇంజన్లను సిద్ధంగా ఉంచాలన్నారు భారీ వర్షాల వల్ల నీరు సాఫీగా ప్రవహించేందుకు వీలుగా డ్రైనేజీలను శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద, హాస్పిటల్స్, మొబైల్ టవర్ల వద్ద విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా ఉండేందుకు జనరేటర్ లను సిద్ధం చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు ఆదేశించారు. పల్లపు ప్రాంతాలలో నీట మునిగిన ఇళ్ల వద్ద నుండి నీరును బయటకు తోడేందుకు మోటార్లు సిద్ధం చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. మండల స్థాయి కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తుఫాను తీవ్రతను ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయి ప్రత్యేక అధికారుల సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు పేరుపాలెం బీచ్ లో సముద్ర స్నానాలు, గోదావరి నదిలో స్నానాలు ఆచరించకుండా తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. తుఫాను కు సంబంధి క్షేత్రస్థాయిలో ఏ విధమైన సమస్యలు ఉన్న కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలి అన్నారు. తుఫాను కారణంగా వాతావరణ శాఖ రానున్న మూడు రోజులలో భారీ వర్షాల హెచ్చరికల చేసిన నేపథ్యంలో ప్రజలు, అధికార యంత్రాంగం అప్రమత్తతతో పూర్తి సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఈ గూగుల్ మీట్లో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, సిపిఓ కే.శ్రీనివాసరావు, డీఎస్ఓ ఎన్.సరోజ, జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తాసిల్దారులు, ఎండిఓ లు తదితరులు పాల్గొన్నారు.

# 137 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురు అరెస్ట్

### బ్రీజా కారు, రెండు బైకులు, మూడు మొబైల్స్ సీజ్, ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు.

### చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు.

**చింతపల్లి, అక్టోబర్ 26 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి రవాణాపై పోలీసులు దాడులు కఠినతరం చేశారు. అల్లూరి ఏజెన్సీ ప్రాంతం నుంచి నర్సీపట్నం దిశగా తరలిస్తున్న 137 కిలోల నిషేధిత గంజాయిను అన్నవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో లోతుగడ్డ బ్రిడ్జి వద్ద ఎస్సై జి వీరబాబు ఆధ్వర్యంలో ముమ్మర వాహన తనిఖీలు చేపట్టినట్లు చింతపల్లి సీఐ ఎం. వినోద్‌బాబు తెలిపారు. ఒరిస్సా రాష్ట్రం నుంచి మూలకొత్తూరు మార్గంగా వస్తున్న బ్రీజా కారు (ఏపీ 39 డిజె 4656)ను ఆపి తనిఖీ చేయగా మూడు గంజాయి మూటలు లభించాయి. అదే సమయంలో వెనుక వస్తున్న రెండు ద్విచక్ర వాహనాల్లో ఒక్కొక్క మూట చొప్పున గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. మొత్తం ఐదు మూటలు స్వాధీనం చేయగా వాటి బరువు 137 కేజీలకు చేరిందని






వివరించారు. సీఐ వినోద్‌బాబు వెల్లడించిన వివరాల ప్రకారం, పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో ఒకరు జీకే వీధి మండలం, ముగ్గురు చింతపల్లి మండలానికి చెందినవారైనట్లు తెలిపారు. ఇంకా పరారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులు చింతపల్లి మండలం చెందిన వారుగా గుర్తించారు. వారి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపును వేగవంతం చేశాయి. అక్రమ రవాణాకు ఉపయోగించిన బ్రీజా కారు, రెండు బైకులు, మూడు మొబైల్ ఫోన్లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసిన గంజాయి విలువ రూ. 13 లక్షలుగా అంచనా వేశారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సీఐ స్పష్టం చేశారు. ఈ దాడిలో అన్నవరం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గెమ్మెలి సన్యాసిరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి రవాణాపై ఇలాగే కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

# కొత్తపేటలో కుక్కల బెడద..

## భయభ్రాంతుల్లో ప్రజలు

### 131 మంది కుక్కకాటుక బాధితులు %-%

### అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

**కొత్తపేట, అక్టోబర్ 26 ( తెలుగు రాష్ట్రం):**

కొత్తపేట పట్టణంలో కుక్కల బెడద రోజు రోజుకూ పెరుగుతోంది. వీధుల్లో అల్లాడుతున్న పిచ్చికుక్కల భయంతో ప్రజలు ప్రాణాలు చేతుల్లో పెట్టుకుని తిరుగుతున్న దుస్థితి నెలకొంది. వందలసార్లు విన్నపించుకున్నా పట్టించుకోని అధికారులు ప్రజల్లో ఆగ్రహం రేపుతున్నారు. మొన్న స్థానిక శిరిడి సాయిబాబా ఆలయం సమీపంలో ఇద్దరిపై పిచ్చికుక్క దాడి చేయగా, నిన్న మారుతి సెంటర్ అమ్మవారి దేవాలయం ఎదుట సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని కరిచింది. ఈరోజు మరింత విషాదకరంగా, 60 ఏళ్ల వృద్ధుడు నడుచుకుంటూ వెళ్తుండగా నాలుగు చోట్ల కుక్కలు కరిచాయి. అతడు ప్రస్తుతం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వర్గాల సమాచారం ప్రకారం, ఈ





నెలలోనే 131 మంది కుక్క కాటుకకు గురయ్యారు. ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతున్నా, పట్టణంలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. "ప్రజల ప్రాణాలు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, కుక్కల నియంత్రణకు వెంటనే చర్యలు చేపట్టాలని" వారు అధికారులు కోరుతున్నారు.

# నేటి నుంచి అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన జిల్లా కలెక్టర్

**అమలాపురం అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలోఈనెల 27, 28, 29 తేదీలలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనీ అన్ని విద్యాసంస్థలకు తాత్కాలిక సెలవులు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ప్రకటించారు. మొంథా తుఫాను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధం కావాలన్నారు. ఇప్పటికే సముద్ర తీరం వెంబడి ఉన్న ఆవాసాలకు పునరావాస కేంద్రాలు మ్యాపింగ్ చేసి తుపాను హెచ్చరికలకు అనుగుణంగా తరలింపు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్తు పునరుద్ధరణకు సమాయత్తం కావాలని ఏపీ ఈపీడీసీఎల్ ఇంజనీర్లను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్లు సిపిడబ్ల్యుఎస్ ఇతర సురక్షిత త్రాగునీటి ప్లాంట్ల వద్ద విద్యుత్తుకు ప్రత్యామ్నాయంగా జనరేటర్లను అమర్చి నిరంతరాయంగా సురక్షిత త్రాగునీరు సరఫరా చేయాలన్నారు. ఆర్అండ్బి పంచాయతీ రాజ్ ఇంజనీర్లు ఈదురు గాలులు మూలంగా రహదారులపై అడ్డంగా పడిన చెట్లు తొలగింపుకు జెసిబి లు పవర్ రంపాలు క్రేన్లతో సిద్ధంగా ఉండాలన్నారు. తుఫాన్ హెచ్చరికలు కనుగుణంగా తీరప్రాంత ఆవాసాలలో ముంపు బారిన పడే అవకాశం ఉన్న ముంపు బాధితులను ముందుగానే మ్యాపింగ్ చేసిన పునరావస కేంద్రాలకు, పునరావాస కేంద్రాలుగా ఎంపిక చేసిన పాఠశాలలకు తరలించాలని సూచించారు. తుఫాన్ హెచ్చరికలకు అనుగుణంగా సహాయక చర్యలను చేపట్టేందుకు సమాయత్తం కావాలన్నారు. పునరావత కేంద్రాలలో అన్ని సౌకర్యాల తోపాటుగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ ముంపు బాధితులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలన్నారు...

## మొంథా తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలి : -ఎమ్మెల్యే శిరీష దేవి



**కూనవరం, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం విలేఖరి):**

మొంథా తుఫాను ప్రభావం చాలా ఎక్కువగా ఉన్నందున నియోజక వర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి కోరారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రకటన విడుదల చేసారు. ఈ నెల 28వ తేదీన కాకినాడ సమీపంలో తీరాన్ని తాకుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసినట్లు తెలిపారు. దీనితో ఆ తుఫాన్ ప్రభావం మన మన్యంలో కూడా ఉండే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండి అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే తుఫాను ముందుస్తు సన్నాహక చర్యలపై సంభంధిత అధికారులతో మాట్లాడారు. తుఫాను ప్రభావం ఉండే అన్ని మండలాల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామ స్థాయిలోని సిబ్బంది అంతా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. అలాగే నియోజకవర్గం ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని కోరారు. తుఫాన్ ప్రభావంతో గంటకు 90 నుండి 100 కి.మీ.ల.వేగంతో ఈదురు గాలులు వీయవచ్చని, ఈనెల 26వ తేది ఆదివారం నుండి తుఫాను ప్రభావం కనిపిస్తుందని చెప్పారు. అదే సమయంలో మన ప్రాంతంలో పెద్ద పెద్ద కాలువలు వాగులు దాటకుండా ఉండాలన్నారు. మన మన్యంలో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కాలువలు దాటి బయటకు రావాల్సిన గ్రామాల ప్రజలు ముందస్తుగా తాగునీరు పాలు, కూరగాయలు, కొవ్వొత్తులు వంటి అవసరమైన ఇతర నిత్యవసర వస్తువులు తగినంత మేర అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. తుఫాను కారణంగా ఎక్కడైనా విద్యుత్ కు అంతరాయం కలిగితే వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అదే విధంగా తుఫాను సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుఫాన్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ కార్యాలయం చరవాణి నెం...6300781010, 8500888143, 8985096667లలో సంప్రదించాలని కోరారు.

## డాక్టర్లపై చర్యలు కోరుతూ అల్లూరి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

**కూనవరం, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం విలేఖరి):**



రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లు నిర్లక్ష్యం కారణంగా నరసాపురం గ్రామానికి చెందిన కోసు బాపనమ్మ, పుట్టిన బిడ్డ మృతికి కారకులైన రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సిబ్బందిపై క్రిమినల్ చర్యలు, ఎస్సీ / ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసి సంక్షేమ పరిషత్ మరియు మృతురాలి భర్త కోటం రాజన్న దొర శనివారం నాడు పాడేరు అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందని వారు తెలియజేశారు. ఈ సందర్భంగా బాపనమ్మ భర్త కోటం రాజన్న దొర మాట్లాడుతూ నా భార్య మరియు నా బిడ్డ మృతి చెందటానికి రంపచోడవరం ఏరియా ఆసుపత్రి డాక్టర్లదే 100 శాతం తప్పిదమని నాకు జరిగిన అన్యాయం మరే కుటుంబానికి జరగకూడదని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. నా భార్య బిడ్డలను చంపినట్లే ఇదే ఏరియా ఆసుపత్రిలో చాలామందిని ఈ డాక్టర్లు నిర్లక్ష్యంతో చంపేశారని ఆయన తెలిపారు. నాకు నా కుటుంబానికి విషాదాన్ని మిగిలించిన ఈ డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఊరుకునేది లేదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నేను చేస్తున్న న్యాయ పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఇంత అన్యాయం జరిగిన అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని తన కుటుంబాన్ని ఓదార్చడానికి గాని అసలు ఏం జరిగిందో తెలుసుకోవటానికి కూడా రాకపోవడం ఇంకా బాధాకరమని అధికారులంతా ఒకటేనని, గతంలో మాతా శిశు మరణాలు జరిగినప్పుడు కూడా ఈ డాక్టర్లను అధికారులే కాపాడారని ఆయన ఆరోపించారు. నా భార్య బిడ్డలు మృతి చెందటానికి కారుకులైనటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయకపోతే అవసరమైతే అధికారుల మీద కూడా కోర్టుకు వెళ్తానని ఆయన తెలియజేశారు.

## అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా వబిలిశెట్టి

**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం విలేకరి):**



అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా వబిలిశెట్టి నటరాజ్ నియమితులయ్యారు. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ సలహా బోర్డు చైర్మన్ గంజి రాజమౌళి గుప్త, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావు నియామక పత్రాలను జారీ చేశారని ఒక ప్రకటనలో తెలిపారు. 2025 నుంచి 2028 వరకు పదవిలో కొనసాగుతానని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన వబిలిశెట్టి నటరాజును జిల్లా ఆర్యవైశ్య ప్రముఖులు, తాడేపల్లిగూడెం శ్రీ ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు, అభినందనలు తెలిపారు.

# ప్రజలు అధికారులు అప్రమత్తతతో ఉండాలి







**అమలాపురం అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తుఫాను నేపథ్యంలో ప్రజలు అధికారులు అప్రమత్తతతో ఉండాలని ఎమ్మెల్యే ఆనందరావు గారు సూచించారు. ఆదివారం ఆయన తుఫాను ప్రభావిత ప్రాంతాలైన ఎన్.కొత్తపల్లి, వాసాలతిప్ప, ఎస్.యానం మరియు అల్లవరం మండలం నక్కా రామేశ్వరం, ఓడలరేవు గ్రామాలలో పర్యటించి ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. రానున్న మూడు రోజుల్లో తుఫాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని ప్రజలు సురక్షిత ప్రాంతాలలో ఉండాలని చెప్పారు. అదేవిధంగా తుఫానును ఎదుర్కొనేందుకు అధికారులు అంతా సమాయత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఎప్పుడు ప్రజలకు ఏ అవసరమైనా వెంటనే అధికారులు స్పందించేలా అందుబాటులో ఉండాలని సూచనలు చేశారు. అదేవిధంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా అందుబాటులోనే ఉన్నాయని చెప్పారు.









## సాంప్రదాయ మూలనికి కారణమైన ఆహారాన్ని కాపాడుకుందాం

-సోందె అన్సర్ దొర

**కూనవరం, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం విలేకరి )):**



అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం రేపాక గ్రామంలో సాంప్రదాయ ఆహారం ప్రాముఖ్యతపై అవగాహన మరియు పరస్పర చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆదివాసీ వంటకాలపై పరిశోధన చేస్తున్న సొందే అన్సర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు సహకారం కలిసి గాట్కా దొడ, తొక్కుడ్ దొడ, పప్పు, జొన్న ఆరెలు, నాటు కోడి కొరంగ్, జోన్నా జావ. వంటి స్థానిక వంటకాలను ప్రదర్శించారు. ఈ వంటకాలు గ్రామంలో పండించే బియ్యం, కూరగాయలు, సహజ నూనెలతో తయారు చేయబడ్డాయి. అయితే ఈ కార్యక్రమంలో కన్నమ్మ మాట్లాడుతూ ఈ ఆహారంతోనే మా పెద్దలు ఎనభై సంవత్సరాల వయస్సు దాకా ఆరోగ్యంగా జీవించారు. అప్పట్లో మందులు తక్కువ, కానీ బలం ఎక్కువ ఉండేది" అని తెలిపారు. మన తరం మళ్లీ పాత ఆహారపు విలువలను గుర్తు చేసుకోవాలి. ఇది మన మూలాలు, మన గౌరవం గ్రామ యువకులు రామారావు చెప్పారు. సొందే అన్సర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి తరంలో ఫాస్ట్‌ఫుడ్, ప్రాసెస్డ్ ఆయిల్స్ వలన యువతలో వ్యాధులు పెరుగుతున్నాయి. మన ఆహారం సహజంగా ఉంటే ఆసుపత్రులు మన జీవితానికి దూరంగా ఉంటాయి. ఫాస్ట్‌ఫుడ్ కి దగ్గరగా ఉంటే హాస్పిటల్ కి కూడా దగ్గర అవుతాం. ప్రకృతిలో పుట్టిన ఆహారమే ఆరోగ్యానికి అసలైన మందు" అని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆత్రం నవీన్, దుర్గ ప్రసాద్, వెంకటేష్, శివ రాజ్, నాయకులు రామారావు, యువశక్తి కార్యకర్త రాము, ఇలాంటి కార్యక్రమాలు గ్రామాల్లో తరచుగా జరగాలని సూచించారు. ఆహారమే మన ఆరోగ్యానికి బలమని, ప్రకృతితో జీవించే పద్ధతి మళ్లీ అలవాటు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలు తమ సాంప్రదాయ ఆహారం, ఆరోగ్యం, ప్రకృతి మధ్య ఉన్న బంధంను గుర్తు చేసుకున్నారు.

## మంతా తుఫాన్ ప్రభావం వలన ముందస్తు చర్యలు -డిఎస్పీ వెంకటేశ్వరరావు



**పోలవరం, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**

రానున్న తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజా రక్షణ చర్యలు ం గోదావరి నదిపై బోట్ సర్వీస్ తాత్కాలికంగా నిలిపివేత ం ప్రజలకు సూచనలువాతావరణ శాఖ వెలువరించిన తుఫాను హెచ్చరికల రీత్యా రానున్న రోజుల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో తీవ్రమైన గాలులు, భారీ వర్షపాతం సంభవించే అవకాశం ఉన్నందున ప్రజా రక్షణ దృష్ట్యా పోలవరం %-% పట్టిసీమ మధ్య బోట్ సర్వీస్ తాత్కాలికంగా నిలిపివేయబడినది. అందువల్ల పట్టిసీమ శ్రీ వీరేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులు, యాత్రికులు, మత్స్యకారులు, ఇతరులు నదిపై ప్రయాణం చేయకూడదని తెలియజేయబడుతుంది. క్షేత్ర స్థాయి పంచాయతీ రాజ్, ఫారెస్ట్, రెవెన్యూ, ఇరిగేషన్, నేషనల్ హైవే, ఆర్%డ%బి శాఖల సిబ్బంది అందరూ తమ తమ విభాగాల్లో అప్రమత్తంగా ఉండి తుఫాను సమయంలో అవసరమైన సహాయ చర్యలకు అందుబాటులో ఉండాలి.పాడుబడిన లేదా పురాతన ఇళ్లు, భవనాలు, ఇతర బలహీన కట్టడాలలో నివసించే ప్రజలు వెంటనే ఖాళీ చేసి రెవెన్యూ అధికారులు సూచించిన సేఫ్ షెల్టర్ హోమ్‌లలో ఉండగలరు. లోతట్టు ప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండి, అధికారులు ఇచ్చే సూచనలను పాటించాలి. గుంజవరం, తానాలకుంట, రేపల్లెవాడ, ప్రగడపల్లి మరియు పరిసర గ్రామాల వద్ద ఉన్న వాగులు, వంకలపై రోడ్లు తుఫాను సమయంలో దాటే సాహసం చేయవద్దు. తాత్కాలికంగా ప్రజలు అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి, ఎందుకంటే తుఫాను ప్రభావంతో చెట్లు, విద్యుత్ వైర్లు, స్తంభాలు పడిపోయే ప్రమాదం ఉంది. సెల్ టవర్ కంపెనీలు అత్యవసర కమ్యూనికేషన్ నిమిత్తం ముందుగా జనరేటర్లు, డీసెల్, ఇతర అవసరమైన వస్తువులు టవర్ వద్దే సిద్ధం చేసుకోవాలి.అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించవలసిన నంబర్లు: టోల్ ఫ్రీ పోలీస్ ఎమర్జెన్సీ సేవలు: ?? 112 పోలవరం ఎస్.ఐ: ?? 9440796664 పోలవరం సి.ఐ: ?? 9440796663 జిల్లా సైక్లోన్ ఎమర్జెన్సీ కాల్ సెంటర్ ం సంబంధిత అధికారులను సంప్రదించవచ్చు.ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, ఈ తుఫాను సమయంలో ప్రభుత్వ సూచనలను పాటించగలరని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆదివాసి హక్కులు - చట్టాలుపై సెమినార్‌ను విజయవంతం చేయాలి

**చింతూరు, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం విలేకరి):**



ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యాలయం చింతూరులో ఆదివాసి హక్కులు - చట్టాలపై నవంబర్ 8 న చింతూరులో జరిగే సెమినార్ ను విజయవంతం చేయాలని కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం చిన్న వీరభద్రం మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ భూభాగంలో ఉన్న 1/70, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, సమాచార హక్కు చట్టం 2005, ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలు, పీసా చట్టాలను ఆదివాసి యువత, ఆదివాసి సమాజానికి అవగాహన కల్పించడానికి ఈ సెమినార్ ఎంతో ఉపయోగపడుతుందని, దీనిని ఆదివాసి నిరుద్యోగులు విద్యార్థులు ఉద్యోగస్తులు, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివాసి చట్టాలు అమలు కొరకై ఆదివాసి యువత సంఘటితంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు నూప అనిల్ ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు పూసం శ్రీను, ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు సోడే మురళి, సోడే రాఘవయ్య, మినప నాగేశ్వరరావు, రవ్వ ప్రసాదు, మిడియం కొండయ్య, మడివి రాజయ్య, తెల్లం కృష్ణ, కారం శంకురమ్మ, సోడే సత్యవతి, ఆదివాసి విద్యార్థి సంక్షేమ పరిషత్ నాయకులు కట్టం కరణ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చెయ్యండి.. ప్రాణదాతలు కండి..

### -సామాజిక వేత్త కోట హనుమంతరావు



**అంబాజీపేట, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం విలేఖరి):** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇరుసమండ గ్రామానికి చెందిన సామాజిక వేత్త కోట హనుమంతురావు రక్త దానం చేసి ప్రాణ దాత అయ్యాడు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారితో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆసుపత్రికి వెళ్లి ఇప్పటి వరకు 56 సార్లు రక్తదానం చేశారు. అమలాపురం, రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, రాజోలు, మలికిపురం, వివిధ ఆసుపతుల్లో చికిత్స పొందుతున్న వారికి సొంత ఖర్చులతో అక్కడికి వెళ్లి రక్తం అందజేశారు. ఇందులో భాగంగా మలికిపురంనకు చెందిన ఒక మహిళ అనారోగ్యంతో బాధపడుతూ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు బ్లడ్ అవసరం అవి కోట హనుమంతురావును సంప్రదించగా ఆసుపత్రికి వెళ్లి రక్తం అందజేశారు. ఇతనుతో పాటు ఇతను స్నేహితులు అనంద్, విలియమ్స్ కూడా రక్తదానం చేశారు. ఏబీ నెగిటివ్ అరుదైన గ్రూప్ అని 100 మందిలో ఇద్దరికి మాత్రమే ఉండేగ్రూప్ అని అడిగిన వెంటనే ముందుకు వచ్చి రక్తదానం చేసిన హనుమంతురావుకు ఆమె బంధువులు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రతి ఒక్కరు చేయాల్సిన బాధ్యత అని, యువకులు 3 నెలలకు ఒక్కసారి రక్తదానం చేయవచ్చునని ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చు అని రక్తదానం ప్రాణదానం తో సమానం అని తెలిపారు.

### వికసిత్ భారత్ స్ఫూర్తిని చేరువ చేసేందుకు

## విద్యార్థులకు క్విజ్



**తాడేపల్లిగూడెం, అక్టోబర్26 (తెలుగురాష్ట్రం విలేకరి):** ప్రధాని నరేంద్ర మోదీ మనసులో మాట 'మన్ కి బాత్ 'ద్వారా వికసిత్ భారత్ స్ఫూర్తిని ప్రజలకు, విద్యార్థులకు చేరువ చేసేందుకు కృషి జరుగుతోందని బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మనసులో మాట ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో కళా సంస్కృతి, నైపుణ్యం, విజ్ఞానం, వ్యవసాయ పారిశ్రామిక ప్రగతికి సంబంధించి వివిధ అంశాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రతినెల ఆఖరి ఆదివారం ప్రసారమయ్యే మనసులో మాట మనకి బాత్ కార్యక్రమాలలో వెల్లడిస్తున్నారని చెప్పారు. వివిధ రంగాలకు చెందిన వ్యక్తుల, కళాకారుల ప్రతిభ పాఠవాలను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించేందుకు ప్రోత్సహిస్తున్నారన్నారు. మన్ కీబాత్ బాత్ ప్రత్యక్ష ప్రసారాలను పాఠశాలల్లో, కళాశాలల్లో నిర్వహించడం ద్వారా ఆయా అంశాలను విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందని వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు, బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు అడపా రమేష్, పట్టణ పూర్వ అధ్యక్షులు ముప్పిడి సురేష్ రెడ్డి, బిజెపి ఆత్మ నిర్భరభారత్ ఇన్చార్జి రామగాని సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, ఉపాధ్యక్షులు లచ్చిరెడ్డి సత్యనారాయణ, తాడాల సూర్య కుమారి, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి బి.ఆర్.వి.ఎల్. నారాయణ, చెరుకూరి గంగాధర్, ఇబ్బంది బెనర్జీ, మహిళా మోర్చా నాయకురాలు కావ్య రెడ్డి, గంట వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ పుట్టాని కలిసిన

## ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**జీలుగుమిల్లి, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఇరువురు కలిసి పోలవరం నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై, కేంద్ర నిధుల వినియోగం, రహదారులు, విద్యుత్, తాగునీటి సమస్యలు, గిరిజన ప్రాంతాల మౌలిక వసతుల అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు.

ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నియోజకవర్గంలోని పలు ప్రాజెక్టులకు కేంద్ర సహాయం అవసరమని ఎంపీకి తెలియజేశారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని సాగు నీటి సదుపాయాల విస్తరణ, రహదారి విస్తరణ పనులు, మరియు విద్యా సంస్థల అభివృద్ధి వంటి అంశాలను ప్రాధాన్యంగా ప్రస్తావించారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ప్రజల అవసరాలు, అభివృద్ధి అంశాలను సానుకూలంగా పరిశీలించి కేంద్ర స్థాయిలో తగిన సహకారం అందించడానికి హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం కోసం ఇద్దరు ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పని చేయాలని సంకల్పించారు.

## వైభవంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముందస్తు పుట్టిన రోజు వేడుకలు




**రాజమహేంద్రవరం, అక్టోబర్ 26 (గోదావరి ప్రతినిధి) :** రాష్ట్రంలో ఏగాలి వీచినా రాజమండ్రిలో టీడీపీ జెండా ఎగరవేస్తున్న, మహిళలకు ప్రజలకు పాదాభివందనలు చేస్తున్నానని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) వినయంగా చెప్పారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పని చేస్తూ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. యాళ్ళ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ యాళ్ళ ప్రదీప్ సుకుమార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నటరాజ్ థియేటర్ వద్ద ఆదిరెడ్డి శ్రీనివాస్ ముందస్తు జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2 వేలమందికి 5 కేజీల వంతున బియ్యం బ్యాగులను, మొక్కలను పంపిణి చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు భారీ కేకు కట్ చేశారు. ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బుడ్డిగ రవి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజమండ్రిని టీడీపీకి కంచుకోటగా మార్చి వరుస విజయాలు అందిస్తున్న నగర ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. తమను కుటుంబ సభ్యులుగా ఆదరిస్తున్న ప్రజల మధ్యకు రావడం గొప్ప అనుభూతిని ఇస్తోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. 16 సంవత్సరాలుగా తమ కుటుంబంలో తన తల్లిని మేయరుగా, తండ్రిని ఎమ్మెల్సీగా, తన సతీమణిని ఎమ్మెల్యేగా, ఇప్పుడు తనను ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. నాయకత్వ లక్షణాలు పెంచేందుకు అందరికీ పదవులు కల్పిస్తున్నామని ఆయన అన్నారు. అనవసర విమర్శలు, అసత్య ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులు తన మంచితనాన్ని చేతకానితనంగా భావించవద్దని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హెచ్చరించారు. తాను కన్నెర్ర చేస్తే అన్ని ప్రాంతాల్లో ఉన్న తన అభిమానుల ఆగ్రహాన్ని ప్రత్యర్థులు తట్టుకోలేరని ఆయన వ్యాఖ్యానించారు. అయితే రాజకీయ వాతావరణ బాగుండాలని, నగరం, మహిళలు సురక్షితంగా ఉండాలని తాను కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ముందస్తు పుట్టిన రోజు వేడుకల నిర్వాహకుడు యాళ్ళ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ యాళ్ళ ప్రదీప్ సుకుమార్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్నా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నయ్య ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ మొన్నటి ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన అక్కసుతో, అసుయతో వాసు అన్నయ్యను ఈవీఎం ఎమ్మెల్యే అంటున్నారని, కాని రాజమండ్రి సిటీలో ఎవ్రీ టైమ్ ఆయనే ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అని, రానున్న రోజుల్లో మంత్రిగా పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటారని ఆయన ఆకాంక్షించారు. ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ వారి మంచిచెడ్డలు చూసే యువ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నిజమైన ప్రజా నాయకుడని 43 వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వాసుమరో 20 ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉండాలని ఆశీస్సులు అందచేశారు. నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకి రామయ్య, రాచపల్లి ప్రసాద్, కూటమి నాయకుడు దొండపాటి సత్యం బాబు, యెనుముల రంగబాబు, నగర తెలుగు మహిళ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, కప్పల వెలుగు కుమారి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయి

### -రాజమండ్రి కార్పొరేట్ కప్ 2025 - సీజన్ 3 టోర్నమెంట్ ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 26(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి దోహదపడతాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం రాజమండ్రి జిల్లా ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న క్రికెట్ గ్రౌండ్స్ లో టోర్నమెంట్ నిర్వాహకులు బాలాజీ వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజమండ్రి కార్పొరేట్ కప్ 2025 – సీజన్ 3 టోర్నమెంట్ ను మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రముఖ సినీ ప్రొడ్యూసర్, సోనస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో జేమ్స్ వాట్స్ కొమ్ము టోర్నమెంట్ కు స్పాన్సర్ చేయడం సంతోషదాయకమని అన్నారు. రాజమహేంద్రవరానికి క్రీడలతో ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. ఇక్కడి క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించారని వారిలో సుంకర స్వామి నాయుడు, పోతుల వీరభద్రరావు, చాముండేశ్వరి నాథ్ తదితర క్రీడాకారులు రాణించారని అన్నారు. క్రికెట్ సెలక్టర్ ఎం.వి. ప్రసాద్ రాజమండ్రిలో జరిగిన క్రీడలలో పాల్గొన్నారని తెలిపారు. కూటమి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమండ్రి కార్పొరేట్ కప్ సీజన్ 3 టోర్నమెంట్ ను బాలాజీ వారి మిత్ర బృందం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారని అన్నారు. కొన్ని సంస్థ పెద్ద పెద్ద టోర్నమెంట్లు నిర్వహించి కనుమరుగవుతాయి. అయితే బాలాజీ ప్రతి ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి నిలువెత్తు నిదర్శనం జిల్లా ఏ.ఎస్.పి చెంచు రామయ్య అని కొనియాడారు. ప్రతి ఒక్కరితో ఆయన స్నేహభావంతో మెలుగుతారని వివరించారు. ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతీ నియోజకవర్గం కు ఒక స్టేడియం నిర్మించాలని సంకల్పంతో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి ఏటా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న బాలాజీ ఆయన మిత్ర బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టోర్నమెంట్ స్పాన్సర్ ప్రముఖ సినిమా ప్రొడ్యూసర్, సోనస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో జేమ్స్ వాట్స్ కొమ్ము మాట్లాడుతూ తన అభిమాన నాయకుడు మంత్రి కందుల దుర్గేష్ అని తెలిపారు. ఆయన వాక్ చాతుర్యంతో ఉన్నత స్థాయి కి ఎదుగుతారని 6 సంవత్సరాల క్రితమే గుర్తించానని పేర్కొన్నారు. ప్రస్తుతం టూరిజం శాఖ మంత్రిగా ఆయన ఉన్నత స్థాయికి చేరుకున్నారని వివరించారు. ఈ టోర్నమెంట్ లో డాక్టర్స్ టీమ్, రాజకీయ నాయకులు టీములు లేకపోవడం వెలితిగా ఉందని వచ్చే టోర్నమెంట్లో రాజకీయ నాయకులు, డాక్టర్స్, విలేకరులతో టీమ్ లు ఏర్పాటు చేసి టోర్నమెంట్ నిర్వహించాలని సూచించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ శతవసంతాలు కొనసాగించాలని మంత్రి ఆకాంక్షించారు. టోర్నమెంట్ నిర్వాహకులు బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ బిజీ షెడ్యూల్లో కూడా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ టోర్నమెంట్ శని, ఆదివారాల్లో జరుగుతాయని, గత ఏడాది 8 టీములు పాల్గొంటే, ఈ ఏడాది 15 టీములు పాల్గొంటున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ చెంచురెడ్డి, జనసేన నగర అధ్యక్షులు వై. శ్రీనివాస్, గురునాథం, డాక్టర్ కృష్ణ తేజ, సాయి, కొండవీటి ప్రభాకర్, జామి సత్యనారాయణ, బాలాజీ, సాయి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 100 ప్రసవాలు

### అల్లూరి జిల్లాలో అన్ని ఆసుపత్రులకంటే టాప్




**చింతూరు, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ప్రభుత్వ ఆసుపత్రి ఒక రికార్డు సృష్టించింది. ఆసుపత్రి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 100 ప్రసవాలు అక్టోబర్ నెలలో అవ్వడంతో ఈ రికార్డు సొంతం చేసుకుంది. పదేళ్ల క్రితం రాష్ట్ర విభజన జరిగాక విలీన మండలాలైన చింతూరు, కూనవరం, ఎటపాక, వర రామచంద్రాపురం మండలాలకు వైద్య సేవలు అందని ద్రాక్షగానే మారింది. దీంతో ప్రజలు వైద్య సేవలకోసం నానా రకాలుగా ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రి ప్రారంభం నుండి సివిల్ ఆసుపత్రిగా ఉన్న చింతూరు ఆసుప్రత్రి 2018 నుండి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా అప్ గ్రేడ్ అయ్యింది. 2022 నుండి స్పెషలిస్ట్ వైద్యులను వైద్య ఆరోగ్య శాఖ నియమించడంతో ఈ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి రావడంతో విలీన మండలాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. చింతూరు ఆసుపత్రిలో ఇద్దరు గైనకాలజిస్తులు, ఆర్థోపెడిక్ ఒకరు, జనరల్ ఫిజిషియన్ ఒకరు, చెవి ముక్కు, గొంతు వైద్యులు, పిల్లల వైద్యులు, అనస్థిసీయా(మత్తు డాక్టర్), ఇద్దరు జనరల్ వైద్యులను నియమించడంతో ప్రజలకు మంచి సేవలు అందే అవకాశం వచ్చింది.

#### ప్రసవాలపై ప్రత్యేక దృష్టి

2023లోలో డాక్టర్ ఎం. వీ. కోటిరెడ్డి సూపరింటెండెంట్ గా చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి కి రావడం తో ఆయన ప్రజలకు అన్నీ రకాల వైద్య సేవల పై ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా ప్రసవాలు పెంచడం అన్ని రకాల ఆపరేషన్లు చింతూరులో జరిగే విధంగా ప్రయత్నించడం తో ఆసుపత్రిలో రోజు వారి ఔట్ పేషెంట్స్, ఇన్ పేషెంట్స్ సేవలు బాగా పెరిగాయి. ముఖ్యంగా ప్రసవాలు ఎక్కువగా పెరిగేందుకు చర్యలు తీసుకున్నారు. సూపరింటెండెంట్ డా. ఎం వీ కోటిరెడ్డి, మత్తు డాక్టర్ కావడం, గైనకాలాజిస్ట్ లు డా. ఎంవీ రమణారావు, డా శశికళ సమిష్టితో ప్రసవాల పెంపుకు కృషి చేసారు. దీంతో అక్టోబర్ నెల లో 100 ప్రసవాలా టార్గెట్ ను సాధించడం జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల కంటే ఎక్కువ ప్రస వాలు జరిగి చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి ముందంజ లో ఉందన్నారు. చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి లో ఈ ఏడాది జనవరి నుండి అక్టోబర్ నెల వరకు అయిన ప్రసవాల వివరాలు, జనవరి 64, ఫిబ్రవరి 48,మార్చి 50, ఏప్రిల్ 68, మే 48, జూన్ 54, జులై 50,ఆగష్టు 92, సెప్టెంబర్ 95, అక్టోబర్ 100 అయ్యాయి. చిన్న పిల్లల వైద్య సేవలకోసం కోసం ఏర్పాటు నావజాత శిశు కేంద్రం (ఎస్ ఎన్ సీ యూ)లో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఏడాదిలోపు ఉన్న చిన్న పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. చిన్న పిల్లల వైద్యాధికారి డా. మహేష్ ఆధ్వర్యంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. చిన్న పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కాకుండా శిశు మరణాలను తగ్గించేందుకు ఈ యూనిట్ ఉపయోగ పడుతుంది. చిన్న పిల్లల వైద్య సేవల కోసం పిడియాట్రీషియన్, వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండడం విశేషం. నాలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా, ఛత్తేస్ గడ్ రాష్ట్రాల ప్రజలకు ఇదే ప్రధాన ఆసుపత్రి. ప్రభుత్వ ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్యులతో పాటు స్కానింగ్, ఎక్స రే, అన్ని రకాల రక్త పరీక్షలు, డా. ఎన్టీఆర్ వైద్య సేవలు, డయాలసిస్ సేవలు, ఎన్ ఆర్ సీ కేంద్రం, ఎస్ ఎన్ సీ యూ కేంద్రం ఉండడంతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, చింతూరు ఐటీడీ ఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్, డీసీ హెచ్ ఎస్ డా. నీలవేణి డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డా. పుల్లయ్య సహకారంతో ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నారు. ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ వైద్యాధికారుల పోస్ట్ లు భర్తీ చేయాలి. ప్రస్తుతం జనరల్ ఫిజిషియన్, ఈ ఎన్ టీ, ఆర్థోపెడిక్, పెడియాట్రిక్ వైద్య పోస్టులు భర్తీ చేస్తే ఇంకా ప్రజలకు వైద్య సేవలు అందించ వచ్చు. ఇటీవల 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ గా ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ఇక్కడ ప్రజలకు త్వరలోనే ఇంకా మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.



ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# గుంతలను పూడ్పించిన ఎస్సై క్రాంతికుమార్



**జీలుగుమిల్లి, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్పించిన జీలుగుమిల్లి ఎస్సై క్రాంతి కుమార్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మొంథా"తుఫాన్ వల్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇలా రోడ్ల మీద ఏర్పడిన గుంతలలో నీరు నిలవడం వలన పెద్ద పెద్ద గుంతలు కనపడవని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహన చోదకులకు పెద్ద వాహనాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గుంతలను పూడ్పించడం జరిగిందని అన్నారు. అలాగే తుఫాన్ ప్రభావం వల్ల రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప ఎవరు బయటకు రావద్దని సూచించారు.

# మొంథా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండండి

### -ఎమ్మెల్యే బాలరాజు



**జీలుగుమిల్లి, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
బంగాళాఖాతంలో ఏర్పడిన "మొంథా" తుఫాన్ ఈ నెల 27, 28, 29 తేదీల్లో తీరం దాటే అవకాశం ఉన్నందున, వాతావరణ శాఖల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కూలీలు, వ్యాపారస్తులు, సాధారణ ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాగులు, కాలువలు పొంగి పొర్లే సమయంలో వాటిని దాటే ప్రయత్నం చేయకూడదని హెచ్చరించారు. తుఫాన్ ప్రభావం సమయంలో ఎవరూ ప్రమాదంలో పడకుండా ఉండేలా స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బాలరాజు సూచించారు. ప్రజల భద్రతే ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు.

# ఉపాధ్యాయులను గౌరవించడం అందరి బాధ్యత




**రౌతులపూడి, సెప్టెంబరు 26 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులను గౌరవించాలని శ్రీ సాయి అభ్యుదయ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఆదివారం రౌతులపూడి మండలం పారుపాక గ్రామంలో శ్రీ సాయి అభ్యుదయ ఫౌండేషన్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉద్యోగులకు ఘనంగా సన్మానం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయునికే ఉందని, ఈ గ్రామంలో ప్రభుత్వ బడిని ప్రైవేటు స్కూలుకు ధీటుగా తయారు చేయడానికి కావలసిన సహకారం అందిస్తామని ఫౌండేషన్ వ్యవస్థాపకులు వి.గిరీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గాడి కొండబాబు, ప్రధానోపాధ్యాయులు వెంకట శివ గిరి, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు వరహాలబాబు, గ్రామ సర్పంచ్ పక్కుర్తి లక్ష్మి, ఎంపీటీసీ గెడ్డం వెంకటలక్ష్మి, పి.ఎ.సి.యస్. డైరెక్టర్ జయసింగ్ రావు, గ్రామ పెద్దలు తిరుమల వెంకన్న దొర, శ్రీనివాస వర్మ, జయబాబు, శేఖర్ తదితరులు హాజరయ్యారు.

# తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### -ఎస్ఐ సంతోష్ కుమార్

**వి.ఆర్ పురం, అక్టోబర్ 26(తెలుగురాష్ట్రం విలేకరి):**



అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్ పురం మండలంలోని ప్రజలకు, మత్స్యకారులకు, వ్యవసాయ కూలీలకు రాబోవు తుఫాను దృష్టిలో పెట్టుకొని తమతమా పనులు నిర్వర్తించుకోవాలని, ప్రజలు తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలని యస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళవద్దని, అదేవిధంగా ప్రజలు శబరి, గోదావరిలో స్నానం చేయడానికి గోదావరికి వెళ్లవద్దని, వ్యవసాయ కూలీలు అధిక ప్రవాహం ఉన్నప్పుడు అన్నవరం వాగు దాటవద్దని అని అన్నారు. తెలియజేయడమైనది. తుఫాన్ కారణంగా ప్రస్తుతం పోచవరం టూరిజం బోటింగ్ కూడా నిలిపి వేయడం జరిగిందని తెలియజేశారు.

# ప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న రఘురాం

**తాడేపల్లిగూడెం, అక్టోబర్26 (తెలుగురాష్ట్రం విలేకరి):**



తాడేపల్లిగూడెం పట్టణంలోని రెండో వార్డుకి చెందిన ఎస్ఎస్ ప్రసాద్ స్థానిక సాహితీ ఆసుపత్రిలో తన కాలికి ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైకాపా రైతు విభాగం (ఆక్వా కల్చర్) వర్కింగ్ ప్రసిడెంట్ వడ్డీ రఘురాం నాయుడు ఆదివారం సాహితి ఆసుపత్రికి వెళ్లి ప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తగ్గే వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దేవుని దయతో త్వరగా కోలుకోవాలని, ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని ప్రసాద్ కుటుంబ సభ్యులకు భరోషానిచ్చారు. ఈ కార్యక్రమంలో గొర్రెల శ్రీనివాస్, రెడ్డి రమేష్ రెడ్డి, మాకిరెడ్డి వెంకటేష్ రెడ్డి, మాకరాజు సతీష్, కొండుబోయిన కృపావరం తదితరులు పాల్గొన్నారు.

# అనుబంధ సంఘ కమిటీ సభ్యులు ఎన్నిక

### -మండల తెలుగుదేశం పార్టీ నాయకులు



**వి ఆర్ పురం, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
అల్లూరి సీతారామరాజు జిల్లా వి ఆర్ పురం మండలంలోని మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రంపచోడవరం నియోజకవర్గం శాసనసభ్యురాలు, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు ఆదివారం నాడు అనుబంధ సంఘ కమిటీలను ఎందుకు అవడం జరిగిందని మండల తెలుగుదేశం నాయకులు అన్నారు. ఈ సందర్భంగా మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు ఎస్.కె. పులి, ప్రధాన కార్యదర్శి ఎండి రహీం, మండల ఎస్.టి సెల్ అధ్యక్షులు మడకం రాజు, కార్యదర్శి పాయం భాస్కరరావు ఎన్నుకోవడం జరిగిందని తెలియజేయటానికి సంతోషిస్తున్నామని మండలం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్, జడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, ఎంపీటీసీ వాళ్ల వెంకటేశ్వర రెడ్డి, సొసైటీ అధ్యక్షులు గొంది చంద్రయ్య, పాయం రామారావు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్, ముత్యాల సిద్ధార్థ, ముత్యాల చంద్రశేఖర్, మామిడి రాజు, గోలి సత్తిబాబు, రాములు, గొర్రె కృష్ణయ్య, కారం సుబ్బయ్య, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# టీడీపీని ముందుకు తీసుకొని వెళ్లగల సత్తా ఉన్న యువ నాయకుడు బొర్రా నరేష్

### -మండల జనసేన పార్టీ అధ్యక్షులు ములకాల సాయికృష్ణ



**వి.ఆర్.పురం, అక్టోబర్26 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
తెలుగుదేశం పార్టీని ముందుకు నడిపించే సత్తా ఉన్న యువ నాయకులు బొర్రా నరేష్ కుమార్ అని జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ స్పష్టం చేశారు. ఆదివారం నూతన అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధైర్యంగా ప్రజలతో కలిసి ఉండే మంచి లక్షణాలు ఉన్న నాయకులు బొర్రా నరేష్ కుమార్ అని ఆయన చెప్పారు. వివాదాలకు దూరంగా, అందరితో కలిసి పోయే వ్యక్తి బొర్రా నరేష్ కుమార్ అని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందని, రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి జరుగుతుందని, అదే రీతిలో మండలంలో కూడా ఏ విషయంలో అయినా కలిసి నిర్ణయం తీసుకొని అవగాహనతో ముందుకు నడవాలని వరరామచంద్రాపురం మండలంలో పంచాయితీ ఎన్నికలలో నెంబర్ 1 స్థానంలో ఉండేలా కష్టపడి పని చేద్దామని, మీ పదవికి న్యాయం చెయ్యాలని ఆశీర్వదించారు. బొర్రా నరేష్ కుమార్ మాట్లాడుతూ మీ ఆశీస్సులతో అందరినీ కలుపుకొని కూటమి ప్రభుత్వంలో మండలాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యదర్శి బాగుల అంజన్ రావు, జనసేన వీర మహిళ బాగుల ప్రమీల రాణి, సహాయ కార్యదర్శి మాచర్ల వేణుబాబు, యూత్ ప్రెసిడెంట్ ముంజపు సాయిరామ్ తదితరులు హాజరయ్యారు.

# నాటు టమాటాలకు కార్తీకంలో భలే గిరాక్...

### కేవలం ఒక్కరోజే అమ్ముడు!

**చింతపల్లి, అక్టోబర్ 26 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**





కార్తీక మాసం ప్రభావంతో చింతపల్లి మండలంలోని నాటు టమాటాలకు భారీ డిమాండ్ నెలకొన్నది. జర్రెల పంచాయతీతో పాటు సమీప గిరిజన గ్రామాల రైతులు పండించిన టమాటాలు శనివారం, బుధవారం పర్వదినంలా మార్కెట్‌కు చేరుతున్నాయి. వాహన సౌకర్యం ఉన్నప్పటికీ గిరిజన మహిళలు తలపై బుట్టలు మోసుకొస్తుంటే, పురుషులు కావాడీలు మోస్తూ రావడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. మహిళలు తీసుకొచ్చిన బుట్ట ధర రూ. 400 కాగా, పురుషులు తెచ్చే కావాడీల ధర రూ. 800 నుంచి రూ. 1000 వరకు పలుకుతోందని రైతులు వివరించారు. కార్తీక మాసంలో అయ్యప్ప స్వామి మాలధారులు, శివభక్తులు అధికంగా మార్కెట్‌కు చేరడంతో కొనుగోలుదారుల రద్దీ పెరిగింది. ఇంటింటా కూరగాయ వంటలు చేసే సంప్రదాయం కారణంగా టమాటాల రేటు ఎల్లప్పుడూ పెరుగుతున్నదని వ్యాపారులు తెలిపారు. రైతులు మాట్లాడుతూ పర్వత ప్రాంతాల్లో కష్టపడి పండించే మా పంటకు ఇలాంటి గిరాక్ రావడం సంతోషంగా ఉంది. వచ్చే కొన్ని వారాల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆనందం వ్యక్తం చేశారు. కార్తీక వ్రతాల ప్రభావంతో మేక మాంసం, కోడి మాంసం, చేపల ధరలు తగ్గినప్పటికీ, కూరగాయల ధరలు మాత్రం నిలకడగా పెరుగుతున్నాయి. నాటు టమాటాలే కాకుండా ఇతర కూరగాయలు కూడా ఆకాశాన్ని తాకే రేట్లు నమోదు చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో గిరిజన రైతుల చెమట చిందించిన పంటలకు వినూత్నమైన మార్కెట్ లభించడం, వారికి తాత్కాలికంగా ఉపశమనం కలిగించినట్టైంది.



# తుపాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండండి

**చింతలపూడి, అక్టోబర్ 26 (తెలుగురాష్ట్రం విలేకరి):**
మంథా సైక్లోన్ నేపథ్యంలో ఎలాంటి ప్రమాద పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు చింతలపూడి తహసీల్దార్ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, పోలీసు శాఖ, విద్యుత్, వైద్య, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి, అగ్నిమాపక, రెవెన్యూ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో తుఫాన్ సమయంలో ప్రజల భద్రత, తక్కువ ప్రాంతాల్లో నివసించే కుటుంబాల తరలింపు, సహాయ శిబిరాల ఏర్పాటు, అత్యవసర సేవల సిద్ధత, మరియు వర్షాలు, గాలుల కారణంగా కలిగే నష్టాలను తగ్గించే చర్యలపై చర్చించారు.

# 'మెంథా' తుఫాను హెచ్చరికు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జారీ

### అధికారులతో ముందస్తు సమావేశం



**ఏలూరు జిల్లా/ తెలుగు రాష్ట్రం ప్రతినిధి**
కుక్కునూరు : మండలంలో తాసిల్దార్ కార్యాలయం నందు "యోందా " తుఫాను కారణంగా మండల అధికారులతో మండల ప్రత్యేక అధికారి P.G..బుజ్జి బాబు అత్యవసర సమావేశం నిర్వహించారు. తుఫాను ప్రభావం రెండు రోజులు పాటు తీవ్రంగా ఉంటుందని అధికారులందరూ అప్రమత్తంగా అందుబాటులో ఉండాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ADA ) P .G బుజ్జి బాబు అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తుఫాను ప్రభావం వల్ల ఎవరికి ఇబ్బంది కలగకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చూసుకోవాలని ప్రత్యేక అధికారి బుజ్జి బాబు ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు మేనేజ్మెంట్ వారితో సహా ఎవరైనా రెండు రోజుల నందు స్టడీ క్లాసులని అదనపు తరగతులను నిర్వహించ వద్దు అన్నారు. హాస్టల్ లో విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లో బయటకు పంపవద్దని హాస్టల్ వార్డేన్లకు ఆదేశాలు చేశారు. మెడికల్, విద్యుత్ శాఖ సంబంధించిన అధికారులు తుపాన్ కి అప్రమత్తంగా ఉండాలని అన్నారు అవసరం అయితే ప్రత్యేక సిబ్బందిని ఉపయోగించి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రమేష్ బాబు ఎస్సై రాజా రెడ్డి , అగ్రికల్చర్ ఆఫీసర్ బాలాజీ, ఎలక్ట్రిసిటీ ఏఈ పాప రావు, విద్యాశాఖ , ఫైర్ , ఎంపిడిఓ , విఆర్ఓలు , మెడికల్ డిపార్ట్మెంట్ అన్ని శాఖ అధికారులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ మృతి.

**చింతపల్లి, అక్టోబర్ 26 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**





చింతపల్లి ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రెడ్డి దేముడు నాయుడు (40) గుండెపోటుతో మృతిచెందిన దుర్ఘటన ఆదివారం చోటు చేసుకుంది. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం లింగభోపాలపట్నం గ్రామానికి చెందిన దేముడు నాయుడు చింతపల్లిలో గత కొంతకాలంగా సేవలందిస్తున్నారు. ఆదివారం ఉదయం రోజువారి తనిఖీల్లో భాగంగా జర్రెల ప్రాంతానికి వెళుతుండగా ముల్లుమెట్ట, కడుగుల గ్రామాల మధ్యలో అకస్మాత్తుగా ఛాతి నొప్పి రావడంతో కుప్పకూలారు. వెంటనే సహచర ఉద్యోగస్తులు చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉందని పేర్కొని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. సహచర ఉద్యోగులు నర్సీపట్నం చేరుకునేలోపు ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధృవీకరించారు. దేముడు నాయుడు ప్రస్తుతం అయ్యప్ప స్వామి మాలధారణలో ఉన్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విధి నిర్వహణలో ఉన్న తరుణంలోనే మరణం సంభవించడంతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శాఖ సహచరులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అంత్యక్రియలు ప్రభుత్వ గౌరవాలతో నిర్వహించేందుకు శాఖ తరఫున ఏర్పాట్లు చేసినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. మరణంపై శాఖాధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

# 27వ తేదీన ఏలూరు జిల్లాలో పిజిఆర్ఎస్ రద్దు

**ఏలూరు, అక్టోబర్ 26 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**



జిల్లాలో వాతావరణ శాఖ 'మొంథా తుఫాన్' హెచ్చరికల కారణంగా ఏలూరు జిల్లాలో ఈ నెల 27వ తేదీన నిర్వహించవలసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలు తెలిపారు. ప్రజలు గమనించాల్సిందిగా ఆయన కోరారు.

## మరింత స్లిమ్‌గా రోహిత్..

## ఫిట్‌మ్యాన్‌గా మరింత కాలం

# హిట్‌మ్యాన్ జర్నీ..!

ఢిల్లీ : ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసే నాటికి అధికబరువుతో అవస్థలు పడుతున్న రోహిత్‌ను చూసిన ఫ్యాన్స్ 2027 ప్రపంచకప్ వరకు ఫిట్‌నెస్ ఉంటుందా అని ఆందోళన చెందారు. ఐపీఎల్ 2025లో చివరి సారిగా అతడు కనిపించాడు. నాడు కట్ చేస్తే.. ఆస్ట్రేలియా వన్డే సిరీస్ ముందు సియాట్ అవార్డ్స్ ఫంక్షన్‌కు స్లిమ్‌గా మారిన హిట్‌మ్యాన్‌ను చూసి అభిమానులు ఆశ్చర్యపోయారు. జెర్సీ నెంబర్ 45లో 'టార్గెట్ 2027' లోడ్ అవుతోందని నెట్టింట ఫ్యాన్స్ సంబరాలు చేసుకొన్నారు. తాజాగా అతడి చిరకాల మిత్రుడు అభిషేక్ నాయర్ స్పందిస్తూ.. రోహిత్ వెయిట్‌లాస్ జర్నీ మరింతకాలం కొనసాగుతుందని వెల్లడించాడు. గత మూడు నెలల్లో అతడు 11 కిలోల బరువు తగ్గినట్లు చెప్పాడు.



"రోహిత్ ఫ్లైట్‌లో భారత్‌కు తిరిగి వచ్చే సమయంలో విశ్రాంతి తీసుకొంటాడు. ఇష్టమైన ఆహారాన్ని వదిలేశాడు. దాని ఫలితాలు ఈ సిరీస్‌లో కనిపించాయి. సౌతాఫ్రికాతో సిరీస్‌కు మరో నెల రోజుల సమయం ఉంది. నాటి కల్లా మరింత బరువు తగ్గి కనిపించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు" అని నాయర్ సిడ్నీ మ్యాచ్ సమయంలో బ్రాడ్‌కాస్టర్ వద్ద వ్యాఖ్యానించాడు.

### నాయర్ సాయంతో రోహిత్ ఫిట్‌నెస్‌పై దృష్టి

వాస్తవానికి రోహిత్‌కు టీమ్ ఇండియా మాజీ కోచ్ అయిన నాయరే జిమ్‌లో సాయం చేశాడు. నిత్యం రోహిత్ 3.30 గంటలు కసరత్తులు చేస్తున్నాడని ఇటీవల పెర్త్‌లో మ్యాచ్ సమయంలో మరికొన్ని విషయాలు వెల్లడించాడు. అత్యధిక రిపిటేషన్లతో బాడీబిల్డర్ స్థాయిలో చమటోడుస్తున్నాడని అభివర్ణించాడు.

"అతడి ట్రైనింగ్ చాలా మందిని ఆశ్చర్యపరుస్తుంది. చివరికి టీమ్ ఇండియా కండీషనింగ్ కోచ్ కూడా నన్ను మందలిస్తాడు. రోహిత్ రోజుకు శరీరంలోని ప్రతి భాగం కోసం 700-800 రిపిటేషన్లు చేసేవాడు. అది దాదాపు గంటన్నర సెషన్. ఇది తేలికపాటి బరువులతో జరిగేది. దీంతోపాటు ప్రతి సెషన్‌లో 15-20 నిమిషాలు క్రాస్ ఫిట్ ట్రైనింగ్ చేసి ముగించేవాళ్లం. ఇది గుండె పనితీరును మరింత మెరుగు పరుస్తుంది. వారంలో ఆరు రోజులపాటు ఇలా మూడు నెలలు శిక్షణ జరిగింది.

అక్కడితో ముగియలేదు. అతడు తన ఆహారపు అలవాట్లను నియంత్రించుకొన్నాడు. ముంబయిలోని ఫేమస్ అయిన వడాపావ్‌ను తినడం కూడా మానేశాడు. ఆటపట్ల అతడి నిబద్ధత అది. మూడు గంటలు జిమ్‌లో పడిన శ్రమ ఫలించాలంటే.. ఆ తర్వాత 21 గంటలు నియంత్రించుకోవడం అవసరం.

తొలి ఎనిమిది వారాలు కఠినమైన శిక్షణ జరిగింది. కండరాలు పెంచే కంటే.. చురుకైన క్రికెటర్‌గా ఉండేందుకే రోహిత్ ఇష్టపడ్డాడు. ఆ తర్వాత వస్తున్న ఫలితాలకు అనుగుణంగా శిక్షణలో మార్పులు చేశాము. ఇక తొలిసారి ప్రాక్టిస్‌కు వెళ్లినప్పుడు.. అతడు ఓ డిఫెన్స్ షాట్ ఆడి నాన్‌స్ట్రైకర్ వైపు పరిగెత్తాడు. వెంటనే 'సోదరా.. నేను గాల్లో ఎగురుతున్నాను' అని గట్టిగా అరిచి చెప్పాడు. చాలా కాలం తర్వాత అతడు తేలిగ్గా ఫీల్ అయ్యాడు.

2011లో కూడా రోహిత్ ఇలాంటి ఫిట్‌నెస్ సాధించాడు. నాడు అతడు లావుగా ఉన్న ఫొటో సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చింది. దీంతో అప్పుడు బరువు తగ్గాడు. ఇటీవల ఐపీఎల్ తర్వాత అతడు వెకేషన్‌లో ఉన్నవేళ అలాంటి ఫొటోనే ప్రచారంలోకి వచ్చింది. రోహిత్ ఫిట్‌నెస్ చర్చ మొదలైంది. దీంతో బరువు తగ్గాలని అతడు నిర్ణయించుకొన్నాడు. 2027 వరకు కెరీర్‌ను పొడిగించుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో అతడు ఫిజికల్‌గా ఫిట్‌గా ఉండటం చాలా కీలకం. తొలుత 10 కిలోలు తగ్గడం లక్ష్యంగా పెట్టుకొన్నాం. అది సాధ్యం కాదని అతడు తొలుత భావించాడు. టోర్నమెంట్లు కూడా లేకపోవడం మా నిరంతర సాధనకు కలిసి వచ్చింది" అని నాడు అభిషేక్ నాయర్ వెల్లడించాడు.

# అప్పుడు విమర్శించా..

## ఇప్పుడు ప్రశంసిస్తా: హర్షిత్ రాణాపై క్రిష్

ఢిల్లీ : ప్రతి పర్యటన సమయంలో హర్షిత్ రాణాకు జట్టులో చోటు ఇవ్వడంపై మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించాడు. 'గంభీర్ మనిషి' అంటూ తీవ్ర పదజాలం వాడాడు. తొలి రెండు మ్యాచుల్లో ఒక్కో వికెట్ తీసినా భారీగా పరుగులు సమర్పించాడు. దీంతో హర్షిత్ ప్రదర్శనపై క్రిష్ విమర్శించాడు. కానీ, మూడో వన్డేలో మాత్రం అద్భుతమైన స్పెల్‌తో ఆసీస్‌ను ఆలౌట్ చేయడంలో రాణా కీలక పాత్ర పోషించాడు. నాలుగు వికెట్లు తీసి తన సత్తా చాటాడు. దీంతో క్రిష్ కూడా విమర్శించడం మానేసి రాణాపై ప్రశంసల వర్షం కురిపించాడు. వన్డే సిరీస్‌లో ఆరు వికెట్లు తీసిన అతడు టాప్ వికెట్ టేకర్ కావడం గమనార్హం.



"మూడో వన్డేలో హర్షిత్ రాణా అదరగొట్టాడు. ప్రశంసలకు అతడు పూర్తి అర్హుడు. అతడి ఆటపట్ల చాలా సంతోషంగా ఉన్నా. అతడి ఎంపికపై నేను చాలా విమర్శలు చేశా. వాటన్నింటికీ ముగింపు ఇచ్చాడు. అద్భుతంగా బౌలింగ్ చేశాడు. గత మ్యాచ్‌లో టెయిలెండర్‌గా వచ్చి పరుగులు చేశాడు. ఇప్పుడు తొలి స్పెల్ నుంచే నాణ్యమైన బౌలింగ్ చేశాడు. అతడి ఆత్మవిశ్వాసం రోజు రోజుకూ పెరిగిపోతుంది. మూడో వన్డేలో చాలా కాన్ఫిడెంట్‌గా కనిపించాడు. నాలుగు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఇందులో నా ఫేవరెట్ వికెట్ మాత్రం ఓవెన్‌ను ఔట్ చేయడమే. రాణా అద్భుతమైన బంతిని సంధించాడు. రోహిత్ శర్మ కూడా బాగా క్యాచ్ పట్టాడు. లైన్ అండ్ లెంగ్త్‌తో చక్కటి బౌలింగ్ వేశాడు. మరీ ఎక్కువగా షార్ట్ బంతులు వేయలేదు. అలాగే స్లో బౌలింగ్ చేయలేదు" అని క్రిష్ వెల్లడించాడు.

## ముగిసిన రో-కో ఆసీస్ టూర్..

# నెక్ట్స్ ఏంటి?




**ఆస్ట్రేలియా : ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ ముగిసింది. ఆతిథ్య జట్టు 2-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. టీమ్ఇండియా చివరి మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించినా ప్రయోజనం లేకుండాపోయింది. అయితే, భారత సీనియర్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఫామ్‌లోకి రావడం మాత్రం అభిమానులకు జోష్ తెప్పించింది. కేవలం వన్డేల్లోనే ఆడుతోన్న ఆ ఇద్దరి బ్యాటింగ్‌ను చూసి సిడ్నీ ప్రేక్షకులు కూడా చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. అయితే, ఇక్కడే మరో ప్రశ్న మొదలైంది. వీరు మళ్లీ మైదానంలో కనిపించేదెప్పుడు..?**

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ తర్వాత భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో ఆడనుంది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ స్వదేశానికి తిరిగొచ్చేస్తారు. వచ్చే నెలాఖరున దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ ఉంది. ఆ తర్వాత మరొక నెల వ్యవధిలోనే న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ ఆడనుంది. ఈలోగా రంజీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలు ఆడే వెసులుబాటు ఉంది. ప్రస్తుతం రంజీ ట్రోఫీ ఎలైట్, ప్లేట్ గ్రూప్ మ్యాచులు జరుగుతున్నాయి. నవంబర్ 1 నుంచి ఎలైట్ విభాగంలో ముంబయి, దిల్లీ మ్యాచులు ఉన్నాయి. ఈ రెండు జట్లకు రోహిత్, విరాట్ ప్రాతినిధ్యం వహిస్తే ఇటు ట్రోఫీకి స్టార్ కళ రావడం.. అటు వారికి బ్యాటింగ్ ప్రాక్టీస్ లభించినట్లు అవుతుంది. ఇక జులై 2026లో ఇంగ్లాండ్‌తో మూడు వన్డేలు ఆడాల్సి ఉంది. బీసీసీఐ షెడ్యూల్ ప్రకారం ఇతర జట్లతో మరికొన్ని వన్డేలు కూడా ఆడే అవకాశం ఉంది. వీటన్నింటికి రో-కో సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. ఫిట్‌నెస్ విషయంలో ఏమాత్రం తేడా వచ్చినా తుది జట్టులో ఛాన్స్ రావడం కష్టమే.

### విజయ్ హజారే ట్రోఫీలోనూ..

కేవలం వన్డేల్లోనే ఆడుతున్న వీరిద్దరూ దేశవాళీ మ్యాచుల్లోనూ పాల్గొనాల్సి ఉంటుందని మేనేజ్‌మెంట్ ఇప్పటికే చెప్పింది. ఈ క్రమంలో డిసెంబర్ - జనవరి మధ్యలో విజయ్ హజారే ట్రోఫీ ఉంది. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లతో వన్డే సిరీస్‌ల మధ్య ఈ ట్రోఫీ రానుంది. గ్రూప్ స్టేజ్ మ్యాచుల్లో ఆడేందుకు మాత్రమే అక్కడ వెసులుబాటు ఉంది. ఎందుకంటే న్యూజిలాండ్‌తో సిరీస్‌కు సిద్ధమవ్వాల్సి ఉంటుంది. తమ ఫామ్‌ను కొనసాగించేందుకు ఈ ట్రోఫీని సద్వినియోగం చేసుకోవాలని మాజీలు కూడా సూచించారు.

### రాబోయే వన్డే సిరీస్‌ల వివరాలు..

**దక్షిణాఫ్రికాతో మూడు వన్డేలు**

నవంబర్ 30న రాంచీ వేదికగా తొలి వన్డే
డిసెంబర్ 3న రాయ్‌పుర్ వేదికగా రెండో వన్డే
డిసెంబర్ 6న వైజాగ్ వేదికగా మూడో వన్డే

### న్యూజిలాండ్ వన్డే సిరీస్

వడోదర వేదికగా జనవరి 11న తొలి వన్డే
రాజ్‌కోట్ వేదికగా జనవరి 14న రెండో వన్డే
ఇందౌర్ వేదికగా జనవరి 18న మూడో వన్డే

## భారత్‌తో సెమీ ఫైనల్..

## ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీ దూరం!



**ఆస్ట్రేలియా : మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 సెమీ ఫైనల్‌లో భారత్‌కు కఠిన ప్రత్యర్థి ఎదురైంది. వరల్డ్ కప్ కలను నెరవేర్చుకోవాలంటే ముందుగా సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించాల్సి ఉంటుంది. అక్టోబర్ 30న నవీ ముంబయిలో జరగనున్న ఈ కీలక మ్యాచ్‌కు ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ దూరమయ్యే అవకాశముంది. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌కు ముందు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా హీలీ గాయపడింది. పిక్క కండరానికి గాయమవడంతో ఇంగ్లాండ్, సౌతాఫ్రికా మ్యాచ్‌లకు దూరమైంది. అయితే, ఆ రెండు మ్యాచ్‌ల్లో అలీసా లేని లోటు కనిపించలేదు. రెండింటిలోనూ ఆస్ట్రేలియా భారీ విజయం సాధించింది. తాజాగా అలీసా గాయం గురించి ఆసీస్ హెడ్ కోచ్ షెల్లీ నిట్ష్కే అప్‌డేట్ ఇచ్చారు. హీలీ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదని ఆదివారం పేర్కొన్నారు.**

'అలీసా పూర్తి స్థాయిలో కోలుకోలేదు. ఆమె పరిస్థితిని ఎప్పటికప్పుడు వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. సెమీ ఫైనల్‌కు ఇంకా సమయం ఉంది. అప్పటికల్లా హీలీ కోలుకుని సెమీస్‌లో ఆడుతుందని ఆశిస్తున్నాం' అని ఆసీస్ హెడ్ కోచ్ తెలిపారు. ఈ టోర్నీలో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లే ఆడిన హీలీ 294 పరుగులు చేసింది. భారత్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో అలీసా ఆకాశమే హద్దుగా చెలరేగింది. 107 బంతుల్లోనే 21 ఫోర్లు, 3 సిక్స్‌లతో 142 పరుగులు చేసి టీమ్ఇండియా నుంచి మ్యాచ్‌ను లాగేసుకుంది. బంగ్లాదేశ్‌పై కూడా సెంచరీ (113లి) చేసింది. టీమ్ఇండియా చివరగా 2017 వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్ చేరింది. అప్పుడు సెమీస్‌లో ఆస్ట్రేలియాపైనే గెలిచింది.

తెలుగురాష్ట్రం దినపత్రిక



## యాక్షన్ ఎంటర్టైనర్ లో బ్యూటీ క్వీన్ సోనీ చరిష్ఠ

నటి సోనీ చరిష్ఠ త్వరలో ఔట్ అండ్ ఔట్ యాక్షన్ ఎంటర్టైనర్ తో అలరించనున్నారు. తెలుగు %-% హిందీ భాషల్లో తెరకెక్కనున్న ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. యోగాలో సుశిక్షితురాలైన సోని%ొ% పోరాట సన్నివేశాలు రక్తికట్టించేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. నేడు తన జన్మదినాన్ని పురస్కరించుకుని తన సన్నిహితుల సమక్షంలో సోనీ తన జన్మదినాన్ని నిరాడంబరంగా జరుపుకున్నారు.

# పాక్ టెర్రరిస్ట్‌గా సల్మాన్ ఖాన్..?

- పాక్ టెర్రరిస్ట్ జాబితాలో సల్మాన్ ఖాన్ పేరు చేర్చారన్న వార్తలు
- బలూచిస్థాన్‌పై సల్మాన్ చేసిన వ్యాఖ్యలే కారణమంటూ ప్రచారం
- ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసిన పాకిస్థాన్ ప్రభుత్వం
- ఉగ్రవాదుల జాబితాలో సల్మాన్ పేరు లేదని అధికారిక వెల్లడి
- సంచలనం కోసమే తప్పుడు కథనాలు సృష్టించారని ఆరోపణ
- సౌదీ అరేబియాలో జరిగిన ఓ కార్యక్రమంలో సల్మాన్ వ్యాఖ్యలు



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌ను పాకిస్థాన్ ప్రభుత్వం టెర్రరిస్ట్‌గా ప్రకటించిందంటూ ఆదివారం పలు మీడియా సంస్థల్లో వచ్చిన వార్తలు తీవ్ర కలకలం రేపాయి. బలూచిస్థాన్‌పై ఆయన చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారని, దేశ యాంటీ-టెర్రరిజం చట్టంలోని 'ఫోర్త్ షెడ్యూల్'లో ఆయన పేరు చేర్చారని ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని పాకిస్థాన్ ప్రభుత్వమే స్వయంగా స్పష్టం చేసింది. ఇది పూర్తిగా నిరాధారమైన, తప్పుడు ప్రచారం అని తేలిపోయింది. పాకిస్థాన్ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ వార్తలను తీవ్రంగా ఖండించింది. తమ అధికారిక ఎక్స్ (X) ఖాతా ద్వారా ఈ విషయంపై ఫ్యాక్ట్ చెక్ వివరాలను విడుదల చేసింది. సల్మాన్ ఖాన్‌ను టెర్రరిస్ట్‌గా ప్రకటించారన్న వార్త అవాస్తవమని, సంచలనం కోసమే ఇలాంటి తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. పాకిస్థాన్ జాతీయ కౌంటర్ టెర్రరిజం అథారిటీ (NCTA) విడుదల చేసే నిషేధిత వ్యక్తుల జాబితాలో గానీ, హోం మంత్రిత్వ శాఖ గెజిట్‌లో గానీ సల్మాన్ ఖాన్ పేరు ఎక్కడా నమోదు కాలేదని స్పష్టమైంది.

**అసలేం జరిగింది?**

ఇటీవల సౌదీ అరేబియాలోని రియాద్‌లో 'జాయ్ ఫోరమ్ 2025' అనే కార్యక్రమం జరిగింది. ఈ వేడుకకు సల్మాన్ ఖాన్‌తో పాటు షారుఖ్ ఖాన్, ఆమిర్ ఖాన్ కూడా హాజరయ్యారు. అక్కడ మధ్యప్రాచ్యంలో భారత సినిమాల ప్రభావం గురించి సల్మాన్ మాట్లాడుతూ.. "ఇక్కడ చాలా దేశాల వారు పనిచేస్తున్నారు. బలూచిస్థాన్ నుంచి వచ్చిన వారు ఉన్నారు, అఫ్గానిస్థాన్ నుంచి వచ్చిన వారు ఉన్నారు, పాకిస్థాన్ నుంచి వచ్చిన వారు ఉన్నారు.. అందరూ ఇక్కడ పనిచేస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల్లో ఆయన పాకిస్థాన్, బలూచిస్థాన్‌లను వేర్వేరుగా ప్రస్తావించడమే ఈ తప్పుడు ప్రచారానికి కారణమైంది.

**ఏమిటీ 'ఫోర్త్ షెడ్యూల్'?**

పాకిస్థాన్ యాంటీ-టెర్రరిజం యాక్ట్ (1997) ప్రకారం, 'ఫోర్త్ షెడ్యూల్' అనేది ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నాయని అనుమానించే వ్యక్తుల జాబితా. ఈ జాబితాలో చేర్చిన వారిపై కఠిన నిఘా ఉంటుంది, వారి ప్రయాణాలపై ఆంక్షలు విధిస్తారు. చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉంటుంది. ఇంతటి తీవ్రమైన జాబితాలో సల్మాన్ పేరు చేర్చారంటూ వచ్చిన వార్తలు ఒక్కసారిగా సంచలనంగా మారాయి.

# 'నెపోలియన్' రిటర్న్స్' గ్లింప్స్ విడుదల



ఆచార్య క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రముఖ రైటర్, డైరెక్టర్ ఆనంద్ రవి దర్శకత్వంలో భోగేంద్ర గుప్త నిర్మించిన ప్రొడక్షన్ నెంబర్ 4 చిత్రానికి సంబంధించిన టైటిల్, గ్లింప్స్‌ను ఆదివారం నాడు లాంఛ్ చేశారు. ఆనంద్ రవి, దివి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి 'నెపోలియన్ రిటర్న్స్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఆనంద్ రవి రూపొందించిన నెపోలియన్, ప్రతినిధి, కొరమీను చిత్రాలు ఎంత పాపులర్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పుడు ఈ యాక్టర్- డైరెక్టర్ ఆనంద్ రవి మరోసారి యూనిక్, ఫ్రెష్ కాన్సెప్ట్‌తో నెపోలియన్ రిటర్న్స్‌గా మన ముందుకు రాబోతున్నారు. 'నెపోలియన్' రిటర్న్స్' విషయానికి వస్తే ఆనంద్ రవి తనదైన స్టైల్లో డిఫరెంట్ ప్రమోషనల్ వీడియోను విడుదల చేశారు. దీంతో సినిమాపై క్యూరియాసిటీ క్రియేట్ అయ్యింది. ఈ మూవీ ఎంటైర్ టీమ్ టైటిల్ గ్లింప్స్‌ను హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. 'నెపోలియన్' రిటర్న్స్' టైటిల్ గ్లింప్స్ విషయానికి వస్తే.. ఆనంద్ రవి ఇద్దరితో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కంప్లైంట్ ఇవ్వటానికి వెళతాడు. ఓ గెద ఆత్మ సమస్యగా మారిందని పోలీసుతో చెబుతాడు. మరో వైపు ఆనంద్ రవి విజువల్స్‌తో పాటు తను ఏం కంప్లైంట్ చేయాలనుకుంటున్నాడో దానికి సంబంధించిన విజువల్స్‌ను చాలా వేగంగా చూపించారు. పోలీస్ రఘుబాబు సహా అందరూ ఆ గెద ఆత్మ గురించి మరింత సమాచారం తెలుసుకోవాలనుకుంటారు. ఇంట్లో కనిపించే పుర్రె ఓ చిన్నారిదని చెప్పటంతో ఇదే సరికొత్త హారర్ సస్పెసన్స్ మూవీ అనే భావన కలుగుతుంది. గ్లింప్స్ చివరలో ఓ పోలీస్ ఆఫీసర్ ఆనంద్ రవితో ఇంతకు ముందే నువ్వే కదా నీడ పోయిందని కంప్లైంట్ ఇచ్చావ్ అని అడగటంతో నెపోలియన్ సినిమా రెఫరెన్స్‌ను అక్కడ చూపించారు. గ్లింప్స్‌లో విజువల్స్ చాలా రిచ్‌గా కనిపిస్తున్నాయి. బ్యాగ్రౌండ్ స్కోర్ సన్నివేశాలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. ఆనంద్ రవి, దివి వద్య, ఆటో రామ్ ప్రసాద్, రఘుబాబు, సూర్య పింగ్ పాంగ్, శ్రవణ్ రాఘవేంద్ర, యాంకర్ రవి, రవి వర్మ, మీసాల లక్ష్మణ్ తదితరులు ఇందులో నటించారు. భోగేంద్ర గుప్తా నిర్మిస్తోన్న ఈ సినిమాకు కార్తీక్ కొప్పెర సినిమాటోగ్రఫీ, సిద్దార్థ్ సదాశివుని సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమాకు రచన-దర్శకత్వం ఆనంద్ రవి. మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తామని మేకర్స్ తెలియజేశారు.

# మా అమ్మ ఒరిజినల్ ట్రెండ్ సెట్టర్...

## రవీనా టాండన్ కుమార్తె ఆసక్తికర వ్యాఖ్యలు

- తల్లి రవీనా టాండన్‌కు రాషా తడానీ పుట్టినరోజు శుభాకాంక్షలు
- అమ్మ ఒక ఐకాన్, ఒరిజినల్ ట్రెండ్‌సెట్టర్ అంటూ ప్రశంసలు
- రవీనా పాత ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకున్న రాషా
- జీ సినీ అవార్డ్స్‌లో తన తల్లి పాట 'టిప్ టిప్ బర్సా పానీ'కి డ్యాన్స్ చేసిన వైనం
- తాత రవి టాండన్ సినిమాలోని పాటకు కూడా నివాళి అర్పించిన రాషా
- మూడు తరాల వారసత్వాన్ని గౌరవించానని వెల్లడి



ఒకప్పటి స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ పుట్టినరోజు సందర్భంగా ఆమె కుమార్తె రాషా తడానీ సోషల్ మీడియా వేదికగా భావోద్వేగభరితమైన శుభాకాంక్షలు తెలిపారు. తన తల్లి ఒక ఐకాన్ అని, కాలంతో సంబంధం లేకుండా ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తారని ఆమె పేర్కొన్నారు. తన తల్లి సినీ ప్రస్థానాన్ని, స్టైల్‌ను కొనియాడుతూ రాషా చేసిన పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది. రవీనా టాండన్ కెరీర్ తొలినాళ్లలోని కొన్ని అరుదైన ఫోటోలను షేర్ చేస్తూ రాషా ఒక అందమైన నోట్ రాశారు. "కాలంతో పనిలేకుండా, నిర్భయంగా, ప్రకాశవంతంగా వెలిగిపోయే నా ఐకాన్ అయిన మా అమ్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆమె ఒరిజినల్ ట్రెండ్‌సెట్టర్. అందం, తెలివి, బలం కలబోసిన నా హీరో. నీలా ఎవరూ ఉండలేరు" అంటూ తన ప్రేమను చాటుకున్నారు. ఈ ఫోటోలలో ఒకదానిలో చిన్నారి రాషాను రవీనా ప్రేమగా ఎత్తుకుని ఉండటం విశేషం. తన తల్లిపై రాషాకు ఉన్న అభిమానం ఈ పోస్ట్‌కే పరిమితం కాలేదు. గత జులైలో జరిగిన జీ సినీ అవార్డ్స్ 2025లో కూడా ఆమె తన కుటుంబ వారసత్వానికి ఘన నివాళి అర్పించారు. ఈ వేదికపై తన తల్లి రవీనా టాండన్, తాతయ్య రవి టాండన్, దిగ్గజ నటి మాధురి దీక్షిత్‌లకు అంకితమిస్తూ ఆమె చేసిన డ్యాన్స్ పర్ఫార్మెన్స్ అందరి ప్రశంసలు అందుకుంది. ఆ ప్రదర్శన గురించి రాషా మాట్లాడుతూ, "ప్రపంచానికి ఆ పాటలు భారతీయ సినిమాలో ఐకానిక్ కావచ్చు. కానీ నాకు అవి నా జీవితాన్ని తీర్చిదిద్దిన వారసత్వాలు. ముఖ్యంగా 'టిప్ టిప్ బర్సా పానీ' పాట. ఆ పాట ద్వారా మా అమ్మ సంపాదించిన అభిమానాన్ని నేను దగ్గరుండి చూశాను. అది కేవలం ఒక పాట కాదు, నా జీవితంలో అదొక జ్ఞాపకం, ఒక చిహ్నం. ఆ ఐకానిక్ పసుపు చీరలో స్టెప్పులేయడం ఒక అద్భుతమైన అనుభూతి" అని వివరించారు. "ఇక 'హంగామా హెూ గయా' పాట మా తాతయ్య రవి టాండన్ మొదటి సినిమా 'అన్‌హోనీ'లోనిది. తెరపై చిత్రీకరించిన మొట్టమొదటి డిస్కో సాంగ్ కూడా ఇదే. నేను కేవలం ప్రదర్శన ఇవ్వలేదు. మాధురి మేడమ్, మా తాతయ్య, మా అమ్మ.. ఇలా మూడు తరాల వారసత్వానికి గౌరవం అర్పించాను. ఈ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను" అని రాషా తన మనసులోని మాటలను పంచుకున్నారు.



## రవితేజ 'మాస్ జాతర'

# సెన్సార్ పనులు పూర్తి

రవితేజ కథానాయకుడిగా, భాను భోగవరపు దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర' విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటించగా, సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలుగా వ్యవహరించారు. తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని యూ/ఏ సర్టిఫికెట్ పొందింది. ఈ విషయాన్ని ప్రకటిస్తూ చిత్ర బృందం నూతన పోస్టర్‌ను విడుదల చేసింది. "మాస్, ఫన్, యాక్షన్ అన్నీ ఒకే చోట! వినోదాత్మక మాస్ వేవ్‌ను థియేటర్లలో ఆస్వాదించండి" అంటూ పోస్టర్‌లో పేర్కొన్నారు. సినిమా నిడివి 160 నిమిషాలుగా నిర్ణయించబడగా, అక్టోబర్ 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అదే రోజు ప్రీమియర్స్ ప్రదర్శించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన అనుమతుల కోసం చిత్ర బృందం ప్రయత్నాలు చేస్తోంది. 'ధమాకా' చిత్రం తర్వాత రవితేజ - శ్రీలీల జంటగా నటించిన ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో రవితేజ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. అంతేకాకుండా, 'మాస్ జాతర' ట్రైలర్‌ను అక్టోబర్ 27న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.



# నారా రోహిత్ పెళ్లి వేడుకలు షురూ..

టాలీవుడ్ హీరో నారా రోహిత్ వివాహం ఈ నెల 30న జరగనున్న సంగతి తెలిసిందే. 'ప్రతినిధి 2' సినిమాలో కలిసి నటించిన శిరీషను ఆయన వివాహమాడనున్నారు. ఇప్పటికే వీరి వివాహ వేడుకలు మొదలయ్యాయి. శనివారం హల్దీ వేడుక జరిగింది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339